FLASH INDIA NEWS

www.flashindianews.com

# ఫ్లాష్ ఇండియా

తెలుగు దినపత్రిక

FLASH INDIA TELUGU DAILY

RNI NO. APTEL/2010/33229

సంపుటి : 17 | సంచిక :45 | శనివారం 14.03.2026 | ఎడిటర్ :కొమరాజు శ్రీనివాసులు | పేజీలు :08 | వెల : రూ 2/-



విలేకరులు కావలెను

17 సం॥ లుగా వెలువడుతున్న "ఫ్లాష్ ఇండియా" తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు తెలంగాణ రాష్ట్రంలోని జిల్లాలు, నియోజకవర్గాల వారీగా విలేకరులు కావలెను..

సెల్ నెంబర్: 9951494039


## అలాగైతే మహిళలకు ఉద్యోగాలివ్వరు..




- లీవ్స్ ఇస్తే యాజమాన్యాలు స్త్రీలను నియమించుకోవు
- సమాజంలో చెడు ప్రభావానికి దారితీయవచ్చు
- మహిళల రుతుక్రమ సమయంలో
- సెలవుల పిటిషన్ పై సుప్రీం కీలక వ్యాఖ్యలు
- సెలవులు కావాలంటే ఉద్యోగాలు పోతాయ్!

02

మహిళల నెలసరి సమయంలో తప్పనిసరి సెలవుల చట్టం తీసుకొస్తే.. వారి భవిష్యత్ ప్రశ్నా ర్థకంగా మారుతుందని సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్య లు చేసింది. శ్రామిక మహిళల్లో పురుషుల కంటే తక్కువ అనే మానసిక భయంతో పాటు అభిప్రా యం కూడా ఏర్పడుతుందని పేర్కొంది. మహిళ లకు రుతుక్రమ సెలవులపై జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం ఇవాళ విచారణ చేప ట్టింది. దీనిలో భాగంగా జస్టిస్ సూర్యకాంత్ కీలక వ్యాఖ్యలు చేశారు. రుతుక్రమ సెలవులను తప్పని సరి చేస్తూ చట్టం తెస్తే మాత్రం యాజమాన్యాలు మహిళలను నియమించుకోవడం మానేస్తారని వ్యాఖ్యనించారు.

# పర్యావరణానికి పెద్దపీట

## రిజర్వ్ ఫారెస్ట్ గా గుర్రంగూడ అటవీ ప్రాంతం

- సెక్షన్ 15 ప్రకారం జీవో నెం.7 ద్వారా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ
- అమంగల్ డివిజన్ పరిధిలో 424 ఎకరాలు 31 గుంటల్లో ఉన్న అటవీ భూమి
- హైదరాబాద్‌లో మరో అర్బన్ పార్క్ అందుబాటులోకి..
- గుర్రంగూడ అటవీ భూములను ఫారెస్ట్ రిజర్వ్‌గా మార్పు..
- ఉత్తర్వులు జారీ చేసిన తెలంగాణ ప్రభుత్వం..

03



**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :**
రంగారెడ్డి జిల్లా హయత్‌నగర్ మండలంలోని గుర్రంగూడ అటవీ ప్రాంతాన్ని రిజర్వ్ ఫారెస్ట్ గా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. అమంగల్ డివిజన్ పరిధిలో 424 ఎకరాలు 31 గుంటల్లో ఉన్న అటవీ భూమికి రిజర్వ్ ఫారెస్ట్ హోదా కల్పించింది. సెక్షన్ 15 ప్రకారం జీవో నెం.7 ద్వారా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.కొన్నేళ్లుగా న్యాయ వివాదాల్లో ఉన్న సాహెబ్‌నగర్ కలాన్ భూములపై ప్రభుత్వ హక్కులకు బలం చేకూరింది. సుప్రీంకోర్టు తీర్పుతో అటవీ శాఖ వాదనకు మద్దతు లభించింది. ఆక్రమణలు, అనధికార హక్కుల నుంచి అటవీ భూములకు రక్షణ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. గుర్రంగూడలో భారీ అర్బన్ ఫారెస్ట్ పార్క్ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. హైదరాబాద్ పరిసరాల్లో గ్రీన్ లంగ్ స్పేస్‌ల విస్త-రణకు కీలక నిర్ణయం తీసుకుంది.భాగ్యనగర ప్రజలకు ప్రకృతి మధ్య విశ్రాంతి కోసం, అలానే పర్యావరణ పరిరక్షణ కోసం ప్రభుత్వం ఈ చర్యలు తీసుకుంది. అటవీ భూముల సంరక్షణ విషయంలో ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుంది. హైదరాబాద్ శివార్లలోని గుర్రం గూడలోని 102 ఎకరాల భూమి తెలంగాణ అటవీశాఖకు చెందినదేనని సుప్రీంకోర్టు తీర్పు వెల్లడించిన సంగతి తెలిసిందే. ఈ భూమిని రిజర్వ్ ఫారెస్ట్‌గా నోటిఫై చేయాలని సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది.

## టెన్త్ క్లాస్ ఎగ్జామ్స్..

తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా 10వ తరగతిపరీక్షలకు హాజరు లక్షలాది మంది విద్యార్థులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హృదయపూర్వక శుభాకాంక్షలు 06
ప్రశాంతమైన వాతావరణంలో పరీక్షలు రాసి ఉజ్వలమైన భవిష్యత్తుకు ముందడుగు వేయాల

## రాష్ట్రంలో గ్యాస్ కొరత లేదు..

- గృహ వినియోగదారులు ఆందోళన చెందొద్దు
- ఆస్పత్రులు,ప్రభుత్వ వసతి గృహాలకు సరిపడా స్టాక్
- అధికారులు ప్రజల్లో అపోహలు తొలగించాలె
- బ్లాక్ మార్కెట్ జరగకుండా చర్యలు తీసుకోండి
- పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

02



తెలంగాణ రాష్ట్రంలో వంట గ్యాస్ సరఫరాపై పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కీలక ప్రకటన చేశారు. ఇవాళ ఆయన సచివా లయంలో సివిల్ సప్లై కమిషనర్, ఆయిల్ కంపెనీల ప్రతినిధులు, కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో గ్యాస్ కొరత ఉందంటూ వస్తున్న ప్రచారంలో నిజం లేదని, గృహ వినియోగదారులకు సరిపడా గ్యాస్ అందుబాటులో ఉందని ఆయన స్పష్టం చేశారు. గ్యాస్ సరఫరాపై ఎవరూ ఆందోళన చెందాల్సిన పని లేదని, ప్రతి గృహ వినియోగ దారుడికి అవసరమైన మేర సిలిండర్లు సరఫరా చేస్తామని మంత్రి భరోసానిచ్చారు. గృహ అవసరాల గ్యాస్‌ను పక్కదారి పట్టించి బ్లాక్ మార్కెట్ చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అక్రమ విక్రయాలు జరగకుండా నిరంతరం నిఘా ఉంచాలని అధి కారులను ఆదేశించారు...

## తెలంగాణలో మరో భారీ కుంభకోణం..

### బయటపెట్టిన వాణిజ్య పన్నుల శాఖ

- దాదాపు రూ. 84.15 కోట్ల విలువైన జీఎస్టీ మోసాన్ని రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖ బయటపెట్టింది
- నకిలీ ఇన్వాయిస్‌ల ద్వారా ఇన్ పుట్ ట్యాక్స్ క్రెడిట్ పొందినట్లు..
- ఎస్ కేజీ ట్రేడింగ్ కంపెనీ ప్రొప్రైటర్ సందీప్‌ను అధికారులు అరెస్టు
- ఇతర సంస్థల్లోనూ అక్రమాలు జరిగాయని గుర్తించి వాటి రిజిస్ట్రేషన్‌ను రద్దు

02

## సీఈసీ జ్ఞానేశ్ కుమార్ పై అభిశంసన..


- జ్ఞానేశ్ కుమార్పై అభిశంసన
- తీర్మానం నోటీసులిచ్చిన 190 మంది ప్రతిపక్ష ఎంపీలు
- లోక్ సభ, రాజ్యసభ రెండింటిలోనూ సమర్పణ
- సీఈసీ నిర్ణయాలు వివాదాస్పదంగా ఉన్నాయని ఆందోళన

03



## డాక్టర్ వేషధారణ లో చోరీ..

05



## శశికళ కొత్త పార్టీ

### గుర్తు కొబ్బరిచెట్టు




- 'ఆల్ ఇండియా పురుచ్చి తలైవార్ మక్కల్ మునేత్ర కజగం' పేరుతో ఏర్పాటు
- అధికారిక పార్టీ సింబల్ సైతం ఖరారు
- పార్టీ జెండాపై అన్నాదురై, ఎంజీఆర్, జయలలిత ఫొటోలు

03

## మీతో కలిసి.. ఎంతో చేశాను

### చాలా గర్వంగా ఉందన్న' అడోబ్ సీఈవో



- కంపెనీ పదవి నుంచి వైదొలగ నున్న శంతను నారాయన్
- 18 ఏళ్ల సేవలకు ముగింపు పలుకు తున్నట్టు వెల్లడి
- కొత్త సీఈవో నియామకం తర్వాత బోర్డు చైర్మన్ గా కొనసాగింపు
- ప్యాకేజ్డ్ సాఫ్ట్వేర్ నుంచి క్లౌడ్ మోడల్కు మార్చిన ఘనత
- నారాయణ్ ప్రస్థానాన్ని కొనియా డిన మైక్రోసాఫ్ట్ సీఈవో సత్య నాదెళ్ల

02



## లొంగిపోలేదు.. అరెస్ట్ చేశారు

### 'ఆపరేషన్ కగార్' చాలా చిన్న విషయం

మావోయిస్ట్ మాజీ అగ్రనేత దేవ్ జీ
'ఆపరేషన్ కగార్' చాలా చిన్న విషయం 05
విధానాల అమలులో లోపాలున్నాయి.
సమీక్షించే సమయంలోనే 'పిచ్చుకపై బ్రహ్మాస్త్రం'
మీడియాతో షేర్ చేసుకున్న నక్సల్ లీడర్

## వంటగ్యాస్ భయాలు..

### ఏజెన్సీలకు భారీగా పెరిగిన బుకింగ్స్



- క్యూ కడుతున్న కస్టమర్లు
- హోటళ్లలో కట్టెల పొయ్యిలు స్టార్ట్
- హాస్టళ్లు, పీజీలలో మెనూ చేంజ్
- పట్టణాలకు తాకిన గ్యాస్ టెన్షన్

06

### పెట్రోల్ నో స్టాక్

ఆసిఫాబాద్లో బంక్ వద్ద బోర్డులు బారులు తీరిన వాహన దారులు






## బోల్తాపడిన ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు..

- ఇద్దరి కండీషన్ సీరియస్!
- నిజామాబాద్ జిల్లా గన్నారం శివారులో ఘటన
- డ్రైవర్ నిద్ర మత్తు, ఓవర్ స్పీడే కారణం
- హైదరాబాద్ నుంచి నాగ్ పూర్వెళ్తుండగా ప్రమాదం

06

# నిజాయితీకి మారుపేరు!

**మాజీ ఎమ్మెల్యే కొండిగారి రాములు కన్నుమూత..**



**రంగారెడ్డి,ఫ్లాష్ ఇండియా :** రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలో రెండు పర్యాయములు సీపీఎం పార్టీ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందని ఎమ్మెల్యే కొండిగారి రాములు(91) కన్ను మూశారు. 1989,1994లో అప్పటి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో పేరుందిన నిజాయితీగల ఎమ్మెల్యేగా రాములు ఒక వెలుగు వెలిగారు. ఈరోజు ఉదయం నిద్రలో నుంచి లేచిన ఆయన మొఖం కడుక్కున్న పిదప నలతగా ఉందని మళ్లీ పడుకుని గుండెపోటుతో నిద్రలోనే కన్నుమూశారు. గత జూలై నెలలో భార్య ముత్యాలమ్మ మ-రణించారు. ఆయన స్వగ్రామం మంచాల మండలం ఆరుట్ల 1935వ సంవత్సరంలో జన్మించారు. చిన్ననాటి నుంచి కమ్యూనిస్టు భావాజాలం కలిగి ఉన్న ఈయన తొలిసారిగా 1989లో ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఈయనకు ముగ్గురు సంతానం. ముగ్గురూ కుమారులే. పెద్ద కుమారుడు అనారోగ్య కారణాల వల్ల మృతి చెందారు. ఇక ఇద్దరు కుమారులు ఉండగా, మూడో కుమారుడు కొండి గారి త్రిలోక్ కుమార్, ఈ మధ్యకాలంలో మున్సిపల్ ఎన్నికల్లో 12 వార్డు నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా గెలుపొందారు. ఎలాంటి ఆస్తిపాస్తులు లేకుండా సాధారణ జీవితం గడుపుతున్న వాళ్ళల్లో కొండి గారి రాములు ఒకరు. రాములు మృతి పట్ల ప్రముఖులు సంతాపం తెలియజేశారు.



## రాష్ట్రంలో గ్యాస్ కొరత లేదు..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణ రాష్ట్రంలో వంట గ్యాస్ సరఫరాపై పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కీలక ప్రకటన చేశారు. ఇవాళ ఆయన సచివాలయంలో సివిల్ సప్లై కమిషనర్, ఆయిల్ కంపెనీల ప్రతినిధులు, కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో గ్యాస్ కొరత ఉందంటూ వస్తున్న ప్రచారంలో నిజం లేదని, గృహ వినియోగదారులకు సరిపడా గ్యాస్ అందుబాటులో ఉందని ఆయన స్పష్టం చేశారు. గ్యాస్ సరఫరాపై ఎవరూ ఆందోళన చెందాల్సిన పని లేదని, ప్రతి గృహ వినియోగదారుడికి అవసరమైన మేర సిలిండర్లు సరఫరా చేస్తామని మంత్రి భరోసానిచ్చారు. గృహ అవసరాల గ్యాస్‌ను పక్కదారి పట్టించి బ్లాక్ మార్కెట్ చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అక్రమ విక్రయాలు జరగకుండా నిరంతరం నిఘా ఉంచాలని అధికారులను ఆదేశించారు. ఆసుపత్రులు, ప్రభుత్వ వసతి గృహాలకు ఎలాంటి అంతరాయం లేకుండా సరిపడా గ్యాస్ సరఫరా చేయాలని స్పష్టం చేశారు. వినియోగదారులకు అసౌకర్యం కలిగిస్తే ఉపేక్షించేది లేదని, నిబంధనలు ఉల్లంఘించే ఏజెన్సీలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఇక నిత్యవసర వస్తువుల సరఫరాలో పారదర్శకత ఉండాలని, ప్రజలకు ఇబ్బంది కలగకుండా క్షేత్రస్థాయి అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశించారు.

# అలాగైతే మహిళలకు ఉద్యోగాలివ్వరు..



**ఢిల్లీ :** రుతుస్రావ సెలవుల (మెనుస్ట్రువల్ లీవ్) విషయంలో సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. మహిళలకు నెలసరి సెలవులు తప్పనిసరి చేస్తే అది వారి ఉపాధి అవకాశాలపై ప్రతికూల ప్రభావం చూపుతాయని వ్యాఖ్యానించింది. మేము ఇలాంటి నిబంధనను తప్పనిసరి చేస్తూ చట్టం చేస్తే ఇకపై మహిళలకు ఎవరూ ఉద్యోగాలు ఇవ్వరని, యజమానుల మనస్తత్వం మీకు తెలియదు అంటూ సీజేఐ జస్టిస్ సూర్యాకాంత్ కీలక వ్యాఖ్యలు చేశారు. మెనుస్ట్రువల్ లీవ్‌ను చట్టంగా తీసుకువస్తే మహిళలను పురుషుల కంటే తక్కువగా చూడటానికి దారి తీసే ప్రమాదం ఉందని, అలాంటి చట్టం వల్ల మహిళలు బలహీనులన్న భావన ఏర్పడటంతో పాటు అనవసర భయాలను సృష్టించే అవకాశముందన్నారు. విద్యార్థినులు, ఉద్యోగాల్లో ఉన్న మహిళల తప్పనిసరి మెనుస్ట్రువల్ లీవ్ ఇచ్చేలా రాష్ట్రాలకు ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ న్యాయవాది శైలేంద్ర మణి త్రిపాఠి పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన సీజేఐ ధర్మాసనం ఇలాంటి వాటితో ఉద్యోగాలు చేసుకునే మహిళల కేరీర్ పై తీవ్ర ప్రభావం చూపుతుందని పేర్కొంటూ ఈ పిటిషన్‌ను తోసిపుచ్చారు.

**అవి వారి స్వచ్ఛంద నిర్ణయాలు:**

విచారణ సందర్భంగా కేరళ ప్రభుత్వంతో పాటు కొన్ని ప్రైవేట్ కంపెనీలు ఇప్పటికే మహిళలకు పీరియడ్ సమయంలో సెలవులు ఇస్తున్నాయనే విషయాన్ని సీనియర్ న్యాయవాది ఎంఆర్ షంషాద్ కోర్టు దృష్టికి తీసుకురాగా ఇది స్వచ్ఛంద చర్యలు అని సీజేఐ చెప్పారు. ఈ విషయంలో అవగాహన కల్పించడం, విషయ సున్నితత్వాన్ని కలిగించడం వేరు. కానీ పీరియడ్స్ సమయంలో సెలవులను తప్పనిసరి చేస్తూ చట్టం తెచ్చిన వెంటనే ఎవరూ మహిళలకు ఉద్యోగులు ఇవ్వరని సీజేఐ వ్యాఖ్యానిచారు.

**నెలసరి పరిశుభ్రత ప్రాథమిక హక్కే:**

అయితే నెలసరి పరిశుభ్రత కూడా ప్రాథమిక హక్కేనని సుప్రీంకోర్టు గత జనవరిలో స్పష్టం చేసింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ప్రకారం జీవించే హక్కు, గోప్యతా హక్కులో ఇది అంతర్భాగమని తీర్పులో పేర్కొంది. పాఠశాలల్లో విద్యార్థినులకు ఫ్రీ శానిటరీ ప్యాడ్స్ అందించాలని, కనీస పారిశుద్ధ్య సౌకర్యాలు కల్పించాలని కోరుతూ దాఖలైన పిటిషన్ పై విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు ఈ తీర్పు వెలువరించింది. ఈ క్రమంలో పాఠశాలల్లో బాలబాలికలకు వేర్వేరుగా టాయిలెట్లు ఏర్పాటు చేయాలని, బాలికలకు ఉచిత శానిటరీ ప్యాడ్స్, టాయిలెట్ల సౌకర్యాన్ని కల్పించడంలో విఫలమైతే ప్రభుత్వాన్ని జవాబుదారీతనంగా చేస్తామని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు, పాఠశాలలకు ఆదేశాలు జారీ చేసింది.

# ఆపరేషన్ కగార్‌కు తాత్కాలిక బ్రేక్?..



**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** మాజీ మావోయిస్టు మల్లా రాజిరెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. మేము లొంగిపోయామని జరుగుతున్న ప్రచారాన్ని ఆయన ఖండించారు. మారిన పరిస్థితులకు అనుగుణంగా బయటకు వచ్చి పని చేద్దామని మేమంతా చర్చించుకున్నామని ఇంతలో ఎస్ఐబీ పన్నిన వలలో చిక్కుకున్నామనే సంగతి స్పష్టమైందన్నారు. పోలీసులు తొలుత మమ్మల్ని అరెస్టు చేసి ఆ తర్వాత సరెండర్‌గా చూపించారని ఇందులో మా లోపం ఏమి లేదన్నారు. తాజాగా ఓ చానల్‌తో మాట్లాడిన ఆయన.. ప్రాణ భయంతోనే లొంగిపోయామనడంలో నిజం లేదని చెప్పారు. అదే నిజం అయితే ఆపరేషన్ కగారుతో పాటు అంతకు ముందు జరిగిన అనేక ఆపరేషన్ల సమయంలో అడవుల్లోనే ఉన్నామని, అప్పుడు అనేక దాడులు కూడా జరిగాయన్నారు. విభిన్న ప్రాంతాల్లో ఉన్న కార్యకర్తలను సమన్వయం చేసుకోవడం కోసమే బయటకు వచ్చామని ఇంతలో పోలీసులు అరెస్టు చేశారన్నారు. బయటకు వచ్చిన మమ్మల్నీ పట్టుకుని మీడియా ముందు ప్రవేశపెట్టారు తప్ప ప్రాణభయంతో మేము బయటకు రాలేదన్నారు.

**గణపతి ఆరోగ్యం సహకరించదు:**

మావోయిస్టు అగ్రనేత గణపతి ప్రస్తుతం ఉద్యమాన్ని నడిపే పరిస్థితి లేదని ఆయన ఆరోగ్యం సహకరించనందువల్లే ఉద్యమ బాధ్యతలు అప్పగించి బయటకు వెళ్లిపోయారన్నారు. రెండేళ్ల క్రితం ఆయనను కలిశామన్నారు. మావోయిస్టు ఉద్యమం బలహీనపడిపోయిందనేది స్పష్టంగా తెలుస్తోందని అయితే మిగిలి ఉన్న కేంద్ర, రాష్ట్ర కమిటీ సభ్యులు ఇప్పటికీ ప్రజల మధ్యే తిరుగుతున్నారని వారంతా ఏదైనా ఆలోచన చేస్తే భవిష్యత్ కార్యాచరణ నిర్ధారించుకోవచ్చు. వారికి మా సహకారం కూడా ఉంటుందన్నారు. మాతో వారు ఏకీభవిస్తారా లేదా అనేది వారి ఇష్టం అన్నారు. ఆపరేషన్ కగార్ నేపథ్యంలో జరిగిన నష్టాలకు కారణం ఏంటనేది ఇంకా మిగిలి ఉన్న, లొంగిపోయిన, జైల్లో ఉన్న మావోయిస్టులతో చర్చించి ఒక నిర్ధారణకు రావాల్సి ఉందన్నారు.

**ఆపరేషన్ కు తాత్కాలిక బ్రేక్ ప్రతిపాదన:**

ఆ తర్వాతే సమాజంలో వచ్చిన ఏ మార్పులను పార్టీ పసిగట్టలేకపోయింది దానికి కారణం ఏమిటి అనేది నిర్ధారణకు వస్తామని ఆ నివేదికను మీడియాకు వెల్లడిస్తామన్నారు. దీనికోసం వివిధ ప్రాంతాల్లో ఉన్న మాజీ మావోయిస్టులు, అమరవీరుల కుటుంబ సభ్యులను కలిసే కార్యక్రమం చేపట్టబోతున్నామన్నారు. ప్రజల కోసమే మా శేష జీవితం ఉండబోతుందనేది ప్రజలకు వివరిస్తామన్నారు. మిగిలిన మావోయిస్టులను అజ్ఞాతం నుంచి బయటకు పిలవాలని ఆపరేషన్ కగార్‌ను తాత్కాలికంగా వాయిదా వేయిస్తామని మమ్మల్ని కలిసిన ఇంటెలిజెన్స్ అధికారులు చెప్పారని రాజిరెడ్డి చెప్పారు. అయితే బహిరంగ ప్రకటన చేస్తే వారిని పిలవడానికి మేము సిద్ధమే అని తాము చెపాప్రమన్నారు.

**నో పాలిటిక్స్:**

రాజకీయాల్లోకి వచ్చే ప్రస్తే లేదని రాజిరెడ్డి స్పష్టం చేశారు. ఈ దశలో మేము ఏ రాజకీయ పార్టీలో చేరబోమని, పార్లమెంటరీ రాజకీయాల్లోకి వెళ్లాల్సిన గత్యంతరం అయితే మాకు లేదన్నారు. ప్రజాసమస్యలపై పోరాటాలకు మా మద్దతు ఉంటుందన్నారు.

## అందుబాటులోకి పోర్టబుల్ ఎక్స్‌రే యంత్రం

**సికింద్రాబాద్,ఫ్లాష్ ఇండియా :** తార్నాకలోని తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఆసుపత్రిలో రూ.20 లక్షల విలువైన అత్యాధునిక మొబైల్ డిజిటల్ పోర్టబుల్ ఎక్స్‌రే యంత్రం అందుబాటులోకి వచ్చింది. ఈ యంత్రాన్ని కాన్ ఫైన్ హోమ్స్ సంస్థ సామాజిక బాధ్యత కార్యక్రమంలో భాగంగా ఆసుపత్రికి విరాళంగా అందజేసింది. ఈ యంత్రాన్ని కెనరా బ్యాంక్ తెలంగాణ జోనల్ హెడ్ గూడా లక్ష్మణ్, ఆసుపత్రి సూపరింటెండెంట్ ఢ సీఎంఓ ఎన్. శైలజ మూర్తి శుక్రవారం రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రోగులకు త్వరితగతిన మరియు మెరుగైన వైద్య సేవలు అందించడంలో ఈ పోర్టబుల్ ఎక్స్‌రే యంత్రం కీలకంగా ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ యంత్రం ద్వారా ఆస్పత్రి వార్డుల్లో ఉన్న రోగుల వద్దకే వెళ్లి నేరుగా ఎక్స్‌రే పరీక్షలు నిర్వహించే సౌకర్యం కల్పించబడింది. ముఖ్యంగా కదలలేని రోగులు, అత్యవసర చికిత్స పొందుతున్న వారికి ఈ సదుపాయం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని వైద్యులు తెలిపారు. దీంతో రోగులను ఎక్స్‌రే గదికి తరలించే అవసరం తగ్గి, పరీక్షలు వేగంగా నిర్వహించే అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి మెడికల్ అడ్మినిస్ట్రేటర్ పి. శ్రీనివాస్, కెనరా బ్యాంక్ మేనేజర్లు టిటి అచ్యుతానందం, అశోక్ గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

# మీతో కలిసి.. ఎంతో చేశాను

**న్యూఢిల్లీ :** ప్రముఖ సాఫ్ట్ వేర్ దిగ్గజం అడోబ్ సీఈవో శంతను నారాయణ్ తన పదవి నుంచి తప్పుకో బోతున్నారు. దాదాపు 18 ఏళ్ల పాటు కంపెనీని విజయవంతంగా నడిపిం చిన ఆయన. ఈ కీలక నిర్ణయాన్ని ప్రక టించారు. అయితే, కొత్త సీఈవో బాధ్యతలు చేపట్టే వరకు ఆయన ఈ పదవిలో కొనసాగుతారు. ఆ తర్వాత కూడా బోర్డు చైర్మన్ గా కంపెనీకి తన మద్దతు అందిస్తారు. కొత్త నాయకుడిని ఎంపిక చేసేందుకు అడోబ్ బోర్డు ఒక ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసింది. కంపెనీలో అంతర్గతంగా ఉన్నవారితో పాటు బయటి నిపుణులను కూడా ఈ పదవి కోసం పరిశీలించనున్నారు. శంతను నారాయణ్ నాయకత్వంలో అడోబ్ సాధించిన పరివర్తన అద్భుతమని, ఏఐ యుగంలో కంపెనీ విజయానికి ఆయన బలమైన పునాది వేశారని అడోబ్ లీడ్ ఇండిపెండెంట్ డైరెక్టర్ ఫ్రాంక్ కాల్డెరోనీ ప్రశం సించారు. ఈ సందర్భంగా శంతను నారాయణ్ ఉద్యోగులను ఉద్దేశించి ఒక సందేశం పంపారు. '18 ఏళ్ల తర్వాత సీఈవో బాధ్యతల నుంచి తప్పుకోవాలని నిర్ణయించుకు న్నాను. నా హయాంలో కంపెనీ 3,000 మంది ఉద్యోగుల నుంచి 30,000 మందికి పెరిగింది. ఆదాయం బిలియన్ డాలర్ల నుంచి 25 బిలియన్ డాలర్లకు చేరింది. మనం కలిసి సాధించిన ఈ ఘనత పట్ల చాలా గర్వంగా ఉంది' అని ఆయన పేర్కొన్నారు.

**అభినందించిన సత్య నాదేళ్ల..**

శంతను నారాయణ్ నిర్ణయంపై మైక్రోసాఫ్ట్ సీఈవో సత్య నాదెళ్ల స్పందించారు. "అడోబ్ లో మీది ఒక గొప్ప ప్రస్థానం. ప్రపంచంలోనే అత్యంత ముఖ్యమైన సాఫ్ట్వేర్ కంపెనీలలో ఒకటిగా అడోబ్ను నిలబెట్టారు' అంటూ సోషల్ మీడియాలో అభినంద నలు తెలిపారు. శంతను నారాయణ్ దాదాపు మూడు దశాబ్దాల క్రితం అడోబ్లో చేరారు. 2007లో సీఈవోగా బాధ్యతలు స్వీకరించి, కంపెనీ వ్యాపార నమూనాను ప్యాకేజ్డ్ సాఫ్ట్వేర్ నుంచి క్లౌడ్ ఆధారిత సబ్ స్క్రిప్షన్ సేవలకు మార్చడంలో కీలక పాత్ర పోషించారు. ఆయన నాయకత్వంలోనే ఫొటోషాప్, క్రియేటివ్ క్లౌడ్ వంటి ఉత్పత్తులు ప్రపంచవ్యాప్తంగా ప్రాచుర్యం పొందాయి.

# సినిమా టికెట్ రేట్ల పెంపుపై సుప్రీం స్టే

**ఢిల్లీ :** తెలంగాణలో సినిమా టికెట్ల ధరల పెంపునకు సంబంధించి రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన కీలక ఆదేశాలపై సుప్రీంకోర్టు శుక్రవారం స్టే విధించింది. సినిమా విడుదలకు 90 రోజుల ముందే ధరల పెంపు నిర్ణయాన్ని బహిర్గతం చేయాలన్న హైకోర్టు ఉత్తర్వులను అత్యున్నత న్యాయస్థానం తాత్కాలికంగా నిలిపివేసింది. ప్రముఖ నిర్మాణ సంస్థ 'మైత్రీ మూవీ మేకర్స్' దాఖలు చేసిన పిటిషన్‌ను విచారించిన జస్టిస్ జే.కే. మహేశ్వరి, జస్టిస్ ఏ.ఎస్. చందూర్కర్లతో కూడిన ధర్మాసనం ఈ నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతానికి పాత పద్ధతిలోనే టికెట్ ధరల అనుమతుల ప్రక్రియ కొనసాగవచ్చని కోర్టు స్పష్టం చేసింది.

**అసాధ్యమైన గడువు..**

"చాలా సినిమాలు 90 రోజుల్లోనే నిర్మాణం పూర్తి చేసుకుంటాయి. అటువంటప్పుడు విడుదలకు 90 రోజుల ముందే ధరల పెంపు నిర్ణయాన్ని ఎలా వెల్లడిస్తారు? ఇది అసాధ్యం" అని మైత్రీ మూవీ మేకర్స్ తరపున సీనియర్ న్యాయవాదులు ముకుల్ రోహత్గీ, నిరంజన్ రెడ్డి వాదనలు వినిపించారు. హైకోర్టు ఇచ్చిన ఈ మధ్యంతర ఉత్తర్వుల వల్ల రాష్ట్రవ్యాప్తంగా సినిమాల విడుదల నిలిచిపోయే ప్రమాదం ఉందని, ప్రభావితమయ్యే పక్షాల వాదనలు వినకుండానే హైకోర్టు ఇలాంటి ఆదేశాలు ఇచ్చిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

**అసలు వివాదం ఏమిటి..?**

అడ్వొకేట్ దాచేపల్లి చంద్రబాబు దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన జస్టిస్ ఎన్.వి. శ్రవణ్ కుమార్ నేతృత్వంలోని హైకోర్టు బెంచ్ జనవరి 20, 2026న ఒక ఆదేశం ఇచ్చింది. జనవరి 12న విడుదలైన 'మన శంకర వరప్రసాద్ గారు' సినిమా టికెట్ ధరల పెంపునకు ప్రభుత్వం చివరి నిమిషంలో అనుమతి ఇవ్వడాన్ని చంద్రబాబు సవాలు చేశారు. దీనిపై స్పందించిన హైకోర్టు.. భవిష్యత్తులో టికెట్ ధరల పెంపు నిర్ణయాలను విడుదలకు 90 రోజుల ముందే పబ్లిక్ డొమైన్‌లో ఉంచాలని తెలంగాణ ప్రభుత్వాన్ని, హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌ను ఆదేశించింది. దీనివల్ల ప్రజలు లేదా ఇతర స్టేక్‌హోల్డర్లు ఆ నిర్ణయాన్ని రివ్యూ చేసే అవకాశం ఉంటుందని హైకోర్టు అభిప్రాయపడింది. అయితే, ఈ 90 రోజుల నిబంధన ఆచరణ సాధ్యం కాదని పేర్కొంటూ సుప్రీంకోర్టు ఇప్పుడు దానిపై స్టే విధించింది. అయితే.. ఈ స్టే వల్ల ఉగాది పండుగ సందర్భంగా మార్చి 19న విడుదలయ్యే పవన్ కల్యాణ్ ఉస్తాద్ భగత్ సింగ్ సినిమాకు భారీ ఊరట కలిగించనుంది.

# ఆర్టీసీలో సమ్మె సైరన్

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** రాష్ట్ర రవాణా రంగంలో మరోసారి సమ్మె సెగ మొదలయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. తమ చిరకాల వాంఛ అయిన ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలి అనే ప్రధాన డిమాండ్‌తో ఆర్టీసీ కార్మిక సంఘాలు సమ్మెకు సిద్ధమవుతున్నాయి. ఈ మేరకు కార్మిక జేఏసీ నాయకులు కాసేపట్లో ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డికి సమ్మె నోటీసు ఇచ్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు.

**ప్రధాన డిమాండ్లు ఇవే:**

**ఆర్టీసీని పూర్తిస్థాయిలో ప్రభుత్వ విభాగంగా గుర్తించి, ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా పరిగణించాలి.**

**దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న వేతన సవరణను తక్షణమే అమలు చేయాలి.**

**రిటైర్డ్ ఉద్యోగుల బెనిఫిట్స్ మరియు పెండింగ్‌లో ఉన్న డీఏ బకాయిలను విడుదల చేయాలి.**

**సంస్థను బలోపేతం చేసేందుకు కొత్త బస్సులను ప్రవేశపెట్టాలి మరియు ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలి.**

**ప్రభుత్వ తీరుపై ఆగ్రహం..**

గతంలో ఇచ్చిన హామీలను ప్రభుత్వం విస్మరిస్తోందని కార్మిక నేతలు మండిపడుతున్నారు. "ఎన్నో ఏళ్లుగా ప్రాణాలు పణంగా పెట్టి సేవలు అందిస్తున్నా, మా బతుకుల్లో మార్పు రావడం లేదు. విలీనం ప్రక్రియను వేగవంతం చేయకపోతే రాష్ట్రవ్యాప్తంగా చక్రాగిపోక తప్పదు" అని జేఏసీ ప్రతినిధులు హెచ్చరించారు. అయితే..

ఒకవేళ ఈ సమ్మె గనుక జరిగితే రాష్ట్రవ్యాప్తంగా రవాణా వ్యవస్థ స్తంభించిపోయే ప్రమాదం ఉంది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల ప్రజలు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడే అవకాశం ఉంది. ప్రభుత్వం సానుకూలంగా స్పందించి చర్చలకు పిలుస్తుందో లేక కఠినంగా వ్యవహరిస్తుందో వేచి చూడాలి.

# తెలంగాణలో మరో భారీ కుంభకోణం..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణలో భారీ జీఎస్టీ కుంభకోణాన్ని వాణిజ్య పన్నుల శాఖ అధికారులు ఛేదించారు. నకిలీ ఇన్వాయిస్‌లతో ప్రభుత్వ ఖజానాకు కన్నం వేస్తున్న ముఠా గుట్టురట్టు చేశారు. పూర్తి వివరాల్లోకి వెళ్తే.. తెలంగాణ కమర్షియల్ ట్యాక్సెస్ శాఖ రాష్ట్రంలో జరుగుతున్న భారీ పన్నుల దోపిడీని వెలుగులోకి తెచ్చింది. ఫేక్ ఇన్వాయిస్‌లు సృష్టించి, అసలు సరుకు సరఫరా చేయకుండానే దాదాపు రూ.84.15 కోట్ల మేర ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ పొందిన భారీ మోసాన్ని అధికారులు కనిపెట్టారు. ఈ అక్రమాలకు ప్రధాన సూత్రధారిగా భావిస్తున్న ఎస్‌కేజీ ట్రేడింగ్ కంపెనీ యజమాని సందీప్ కుమార్ గోయల్‌ను అధికారులు అరెస్ట్ చేశారు.

**అసలు మోసం జరిగిందిలా..**

వాణిజ్య పన్నుల శాఖ నిర్వహించిన విచారణలో దిగ్భ్రాంతికరమైన విషయాలు బయటపడ్డాయి. సందీప్ కుమార్ తన ఎస్‌కేజీ ట్రేడింగ్ కంపెనీ ద్వారా ఎలాంటి వస్తువులను విక్రయించకుండానే.. కేవలం కాగితాల మీద ఇన్వాయిసులు సృష్టించి కోట్లాది రూపాయల ఐటీసీని క్లెయిమ్ చేసినట్లు అధికారులు నిర్ధారించారు. ఇతను కేవలం ఒక్క కంపెనీకే పరిమితం కాకుండా.. హెచ్ఎఫ్‌సీ స్టీల్ ట్యూబ్స్ అండ్ వాల్వ్స్, విజయ్ ఇండస్ట్రియల్ నీడ్స్ LLP వంటి ఇతర సంస్థల పేర్లతో కూడా ఇదే తరహా అక్రమాలకు పాల్పడినట్లు గుర్తించారు. ఈ మోసం బయటపడటంతో అధికారులు తక్షణమే రంగంలోకి దిగారు. అక్రమాలకు పాల్పడిన రెండు సంస్థల జీఎస్టీ రిజిస్ట్రేషన్లను రద్దు చేశారు. నిందితుడు సందీప్ కుమార్‌పై తెలంగాణ GST చట్టం-2017 కింద కేసు నమోదు చేశారు. నిందితుడిని కోర్టులో హాజరుపర్చగా.. న్యాయమూర్తి అతనికి జ్యుడీషియల్ కస్టడీ విధించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టే ఇలాంటి నకిలీ ఐటీసీ క్లెయిమ్‌లపై ఉక్కుపాదం మోపుతామని వాణిజ్య పన్నుల శాఖ హెచ్చరించింది. ఎస్‌కేజీ ట్రేడింగ్ కంపెనీ లావాదేవీలపై మరింత లోతైన దర్యాప్తు జరుపుతున్నామని.. ఈ గొలుసుకట్టు మోసంలో ఇంకా ఎవరెవరి ప్రమేయం ఉందనే కోణంలో విచారణ కొనసాగుతోందని అధికారులు తెలిపారు. నకిలీ ఇన్వాయిస్‌లు సృష్టించే వారిపై నిరంతర నిఘా ఉంటుందని స్పష్టం చేశారు.

# ఆందోళన చెందాల్సిన అవసరం లేదు



**గండిపేట,ఫ్లాష్ ఇండియా :** మూసీ ప్రక్షాళన నేపథ్యంలో శుక్రవారం మూసీ జన ఆందోళన్ కమిటీ ప్రతినిధులు, వివిధ బస్తీలు, గేటెడ్ కమ్యూనిటీల నిర్వాసితులు మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్ రావు ను ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా మూసీ ప్రక్షాళన పేరిట ప్రభుత్వం చేపడుతున్న చర్యల వల్ల ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఆయనకు వివరించారు. తమ ఇళ్ల కూల్చివేతలతో ఎదురవుతున్న సమస్యలు, ఆవేదనలను వ్యక్తం చేస్తూ అసెంబ్లీ వేదికగా తమ సమస్యను ప్రస్తావించాలని కోరారు. దీనిపై స్పందించిన హరీశ్ రావు.. మూసీ బాధితులు ఎవరూ భయపడాల్సిన అవసరం లేదని, వారి పోరాటానికి బీఆర్ఎస్ పార్టీ అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. మూసీ పునరుజ్జీవం పేరుతో ప్రభుత్వం సాగిస్తున్న విధ్వంసం, అక్రమ కూల్చివేతలు, అరాచక చర్యలను అసెంబ్లీ వేదికగా ఎండగడతామని, బాధితుల పక్షాన ప్రభుత్వాన్ని నిలదీస్తామని ఆయన పేర్కొన్నారు.

ఫ్లాష్ ఇండియా దినపత్రిక బుక్ చేసుకోవాలి అనుకుంటున్నారా లేదా మీ వ్యాపార ప్రకటనల కోసం మమ్మల్ని సంప్రదించండి 7730032999 flashindiadaily@gmail.com

# ఇదేనా రాజ్యాంగాన్ని కాపాడే మీ నైతికత?

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌కు స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ క్లీన్ చిట్ ఇవ్వడాన్ని సమర్థిస్తారా? లేక చర్యలకు ఆదేశిస్తారా? అని ఏఐసీసీ అగ్రనేత, లోక్ సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీకి మాజీ మంత్రి హరీశ్ రావు లేఖ రాశారు. పార్టీ ఫిరాయింపు నిరోధక చట్టాన్ని బలోపేతం చేస్తామని, ప్రజాస్వామ్య వ్యవస్థలను కాపాడతామని ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చి.. రాజ్యాంగాన్ని చేతబట్టి దేశవ్యాప్తంగా నీతి-సూత్రాలు చెప్పిన మీరు కాంగ్రెస్ అధికారంలో ఉన్న తెలంగాణలో మాత్రం మరోలా వ్యవహరిస్తున్నారని నిలదీశారు. రాజ్యాంగాన్ని కాంగ్రెస్ పార్టీ రక్షించడం అంటే ఇదేనా? దేశవ్యాప్తంగా రాహుల్ గాంధీ బోధించే రాజ్యాంగ నైతికత ఇదేనా అని ప్రశ్నించారు.

**ఇంతకంటే ఆధారం ఇంకేం కావాలి?:**

ఫిరాయింపుల నిరోధక చట్టాన్ని అవకాశవాదం కోసం వాడుకుంటున్నారని హరీశ్ రావు ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ టికెట్‌పై ఎమ్మెల్యేగా ఎన్నికైన దానం నాగేందర్ అధికారికంగా ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ ఇచ్చిన B-Formతో లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేశారు. ఇది ఊహాగానమో, వదంతో కాదు. ఇది ప్రజా రికార్డుల్లో ఉన్న నిజం. అయినా కూడా దానం పార్టీ మారారు అనడానికి ఎలాంటి ఆధారాలు లేవు తెలంగాణలో మీ పార్టీకి చెందిన శాసనసభ స్పీకర్ చెబుతున్నారు. ఒక పార్టీకి చెందిన ఎమ్మెల్యే మరో పార్టీ B-Formపై ఎన్నికల్లో పోటీ చేయడం కూడా ద్రోహానికి ఆధారం కాకపోతే, పదో షెడ్యూల్ ప్రకారం ద్రోహానికి ఆధారం అంటే అర్థం ఏంటో దేశం మొత్తం తెలుసుకోవాల్సిన ప్రశ్నగా మిగిలిపోయిందన్నారు. ఇదేనా కాంగ్రెస్ పార్టీ రాజ్యాంగాన్ని కాపాడే విధానం? దేశానికి మీరు బోధించే రాజ్యాంగ నైతికత ఇదేనా? అని నిలదీశారు.

**ప్రసంగాలతో రాజ్యాంగాన్ని కాపాడలేరు:**

ఒక పార్టీ టికెట్‌పై ఎన్నికైన శాసనసభ్యుడు, మరో పార్టీ జెండా కింద ఎన్నికల్లో పోటీ చేసి కూడా ఎమ్మెల్యేగా కొనసాగితే రాజ్యాంగ ఆత్మ కేవలం రాజకీయ నినాదంగా మారిపోతుందన్నారు. ఢిల్లీలో రాజ్యాంగాన్ని కాపాడుతున్నామని చెప్పి, తెలంగాణలో దాన్ని బలహీనపరచడం ఎలా సమర్థించగలరు? అని నిలదీశారు. అందువల్ల విప్ మార్పిడి చట్టం ప్రకారం దానం నాగేందర్‌పై వెంటనే చర్యలు తీసుకోవాలని తెలంగాణ ముఖ్యమంత్రి, స్పీకర్‌కు మీరు సూచిస్తారా? లేకపోతే, కాంగ్రెస్ పార్టీకి రాజ్యాంగం గురించి మాట్లాడటం రాజకీయ ప్రయోజనం ఉన్నప్పుడేనా అని దేశం భావించాలో చెప్పాలన్నారు. తెలంగాణ ప్రజలు, అలాగే దేశ ప్రజలు నిజాయితీగల సమాధానాన్ని ఆశిస్తున్నారని రాజ్యాంగాన్ని కేవలం ప్రసంగాలతో కాపాడలేమన్నారు.



# పర్యావరణానికి పెద్దపీట

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. హైదరాబాద్‌లోని గుర్రంగూడ అటవీ ప్రాంతాన్ని రిజర్వ్ ఫారెస్ట్‌గా ప్రకటించింది. ఈ మేరకు పర్యావరణ, అటవీశాఖ శుక్రవారం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. మరో భారీ అర్బన్ పార్క్ ఏర్పాటుకు అటవీ శాఖ కసరత్తు చేస్తోంది. మొత్తం 424.31 ఎకరాల అటవీ భూభాగాన్ని రిజర్వ్ ఫారెస్ట్‌గా ప్రభుత్వం గుర్తించింది. రాష్ట్రంలో పచ్చదనాన్ని పెంచడంతో పాటు పట్టణ ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించడమే లక్ష్యంగా అటవీశాఖ ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. నగర శివార్లలోని అటవీ భూములను సంరక్షిస్తూ, వాటిని పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దే ప్రక్రియలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నారు.

**పర్యావరణానికి పెద్దపీట :**

వేగంగా విస్తరిస్తున్న పట్టణీకరణ వల్ల పెరుగుతున్న కాలుష్యాన్ని తగ్గించేందుకు ఈ అర్బన్ పార్కులు 'గ్రీన్ లంగ్స్' (పచ్చని ఊపిరితిత్తులు)గా పనిచేస్తాయి. గతంలో గండిపేట, కోత్వాలగూడ వంటి ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన పార్కులకు వస్తున్న ఆదరణను దృష్టిలో ఉంచుకుని, ఇప్పుడు నిర్మించబోయే పార్కులో మరిన్ని అత్యాధునిక వసతులు, బయో-డైవర్సిటీ పాయింట్లు ఉండేలా అటవీ శాఖ కసరత్తు చేస్తోంది. ఈ ప్రాజెక్టుకు సంబంధించి భూ సర్వే మరియు ఫెన్సింగ్ పనులు త్వరలోనే ప్రారంభం కానున్నాయి.

# రాష్ట్రంలో పరిస్థితి అదుపుతప్పింది..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ లేఖ రాశారు. తెలంగాణలో పరిస్థితులు దిగజారాయని.. సీఎం రేవంత్ రెడ్డి అనుచరులు శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్నారని లేఖలో కేటీఆర్ పేర్కొన్నారు. "రేవంత్ రెడ్డి బినామీ కంపెనీ KLSR ఇన్‌ఫ్రాటెక్ కంపెనీ పైన నమోదైన కేసులు విచారణ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు సాక్ష్యాధారాలను తారుమారు చేసింది. సేకరించిన సాక్ష్యాధారాలు పోయాయి అని ప్రభుత్వ అధికారులు కోర్టులో చెప్పడం దారుణం. సీఎం తన బినామీ కంపెనీ కోసమే అధికారుల పైన ఒత్తిడి తీసుకువచ్చి సాక్ష్యాధారాలను మాయం చేయించారు. రాష్ట్రంలోని విచారణ సంస్థలను పోలీసు అధికారులను నమ్మే పరిస్థితి లేదు.. తన బినామీ కంపెనీ కోసం సాక్షాధారాలను ముఖ్యమంత్రి మాయం చేయించారు. రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ పూర్తిగా క్షీణించింది.. పోలీస్ వ్యవస్థ పైన ప్రజలకు నమ్మకం పోయింది. KLSR కంపెనీ దివాలా తీసిన తర్వాత కూడా రేవంత్ రెడ్డి కాంట్రాక్టులు కేటాయిస్తున్నారు. ఆ సంస్థ పై ఉన్న విచారణను అడ్డుకుంటున్నాడు.

**రేవంత్ రెడ్డి జోక్యం..**

KLSR కంపెనీ పైన ఉన్న ఆర్థిక పరమైన ఆరోపణలు, కేసులపైన పక్షపాతం లేకుండా, ఒత్తిడి లేకుండా నిష్పాక్షిక విచారణ జరిగేలా చూడాలని విజ్ఞప్తి. ఇప్పటికే దివాలా ప్రక్రియ కొనసాగుతున్న కంపెనీ కోసం రేవంత్ రెడ్డి 2500కు పైగా భారీ కాంట్రాక్టులను కేటాయించారు. సాగునీటి, తాగునీటి ప్రాజెక్టులతో పాటు యంగ్ ఇండియా స్కూల్ ప్రాజెక్టులు, రోడ్డు నిర్మాణ పనులను అడ్డగోలుగా రేవంత్ రెడ్డి దివాలా తీసిన ఈ కంపెనీకి అప్పచెబుతున్నారు. KLSR కంపెనీకి రేవంత్ రెడ్డికి ఉన్న అనుబంధం అందరికీ తెలుసు. కంపెనీ కోసం నేషనల్ లా ట్రిబ్యునల్ విచారణలో కూడా రేవంత్ రెడ్డి జోక్యం చేసుకున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికే ఈ KLSR కంపెనీ అంశంలో కేంద్ర ప్రభుత్వ ఏజెన్సీలు తగిన విచారణ చేసి నిజాలు నిగ్గుతేల్చాలని రాష్ట్ర ప్రభుత్వానికి సుప్రీం కోర్టు సూచించింది. అయినా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. కాబట్టి వెంటనే ఈ కంపెనీ చేస్తున్న నేరాలు, ఈ కంపెనీకి



ముఖ్యమంత్రి చేస్తున్న అనుచిత లబ్ది నేపథ్యంలో సీబీఐ , ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ , సీరియస్ ఫ్రాడ్ ఇన్వెస్టిగేషన్ ఆఫీస్ వంటి ఏజెన్సీలతో సంపూర్ణ దర్యాప్తు చేయించండి" అంటూ కేంద్ర మంత్రి అమిత్ షాతో పాటు లేఖ ప్రతులను నిర్మల సీతారామన్ ఆర్థిక శాఖ మంత్రి, కార్పొరేట్ గవర్నెన్స్ బాధ్యతలు నిర్వహిస్తున్న కేంద్ర మంత్రి పీయూష్ గోయల్‌కి, న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్‌కి కూడా కేటీఆర్ పంపించారు.

# నెలాఖరుకు లక్ష ఇందిరమ్మ ఇళ్లు

**కామేపల్లి,ఫ్లాష్ ఇండియా :** రాష్ట్రంలోని నిరుపేదలందరికీ సొంతింటి కల సాకారం చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం కామేపల్లి మండలంలో స్థానిక ఎమ్మెల్యే కోరం కనకయ్యతో కలిసి పర్యటించిన ఆయన సుమారు 12.48 కోట్ల రూపాయల వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయడంతో పాటు, పూర్తయిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను ప్రారంభించి లబ్ధిదారులకు పట్టాలు అందజేశారు.

**అభివృద్ధి పనుల హోరు..**

మండల వ్యాప్తంగా మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా మంత్రి పలు బీటీ రోడ్డు పనులకు శ్రీకారం చుట్టారు. జాస్తిపల్లి నుంచి కెప్టెన్ బంజర వరకు రూ. 3.15 కోట్లతో చేపట్టే పనులతో పాటు, లాల్యతండ నుంచి జగన్నాథ తండా వరకు రూ. 3.33 కోట్లు, ఊటుకూరులో ముత్యాలంపాడు గుడి నుంచి శ్మశాన వాటిక వరకు రూ. 1.80 కోట్లు, తాళ్లగూడెం పరిధిలో టేకుల తండా, పింజరి మడుగు మీదుగా డోర్నకల్ రోడ్డు వరకు రూ. 4.20 కోట్లతో నిర్మించనున్న రహదారులకు ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ప్రజలు మంత్రికి ఘన స్వాగతం పలికారు.

**గత ప్రభుత్వ వైఫల్యాలపై ధ్వజం..**

ముచ్చర్ల, పింజరమడుగు గ్రామాల్లో గత ప్రభుత్వం అసంపూర్తిగా వదిలేసిన ఇళ్లను పూర్తి చేసి లబ్ధిదారులకు అప్పగించిన అనంతరం మంత్రి సభలో మాట్లాడారు. గత పాలకుల పదేళ్ల కాలంలో రాష్ట్ర వ్యాప్తంగా లక్ష ఇళ్లు కూడా నిర్మించలేకపోయారని ఆయన విమర్శించారు. డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పేరుతో పేదలను ఊరించి మోసం చేశారని మండిపడ్డారు. వైఎస్సార్ హయాంలో నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లను అవహేళన చేసిన వారు, తాము అధికారంలో ఉండి కనీసం ఇళ్లు పూర్తి చేయలేకపోయారని ధ్వజమెత్తారు.

**ఏప్రిల్‌లో రెండో విడత..**

ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదే 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసిందని మంత్రి పొంగులేటి తెలిపారు. యుద్ధ ప్రాతిపదికన పనులు సాగుతున్నాయని, మార్చి చివరి నాటికి రాష్ట్రవ్యాప్తంగా లక్ష ఇళ్లను పూర్తి చేసి గృహ ప్రవేశాలకు సిద్ధం చేస్తామని ప్రకటించారు. వచ్చే ఏప్రిల్ నెలలో మరో విడత ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామని, అర్హులైన ప్రతి పేదవాడికి ఇల్లు ఇచ్చి తీరుతామని భరోసా ఇచ్చారు.

**సంక్షేమ పథకాలే శ్రీరామరక్ష..**

పేదరిక నిర్మూలనే లక్ష్యంగా ప్రభుత్వం అనేక కార్యక్రమాలను అమలు చేస్తోందని మంత్రి వివరించారు. ముఖ్యంగా పేదింటి మహిళల కష్టాలను గుర్తించి సన్న బియ్యం పంపిణీ, కొత్త రేషన్ కార్డుల జారీ, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ వంటి పథకాలను అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఊటుకూరులో జరుగుతున్న అభివృద్ధి పనులను వర్షాకాలం లోపే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించడంతో పాటు, స్థానిక ఎమ్మెల్యే కోరిన మరిన్ని రహదారి పనులను ఏప్రిల్‌లో మంజూరు చేస్తానని సభాముఖంగా హామీ ఇచ్చారు.

# కేంద్రం వైఫల్యంతోనే గ్యాస్ సమస్య...

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** గ్యాస్, పెట్రోల్ కొరతకు కేంద్రప్రభుత్వమే కారణమని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆరోపించారు. కేంద్రప్రభుత్వ వైఫల్యంతోనే గ్యాస్ సమస్య వచ్చిందని ఫైర్ అయ్యారు. తెలంగాణలో గ్యాస్ కొరతపై కేంద్రమంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ఈరోజు(శుక్రవారం) ఏబీఎన్ ఆంధ్రజ్యోతితో మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడారు. యుద్ధం నేపథ్యంలో కేంద్రం తక్షణం స్పందించాలని పట్టుబట్టారు. మూసీపై తెలంగాణ ప్రభుత్వానికి ఓ విజన్ ఉందని స్పష్టం చేశారు. పీపీటీ ద్వారా అన్ని అనుమానాలు నివృత్తి చేస్తామని తెలిపారు. మూసీపై గాంధీ మనవడు తుషార్ గాంధీకి తప్పుడు సమాచారం అందినట్లుందని అన్నారు.

**మూసీ నిర్వాసితులకు న్యాయం చేస్తాం..**

మూసీ నిర్వాసితులకు న్యాయం చేస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ భరోసా కల్పించారు. మూసీ పరిసరాలను కాలుష్యం లేకుండా సుందరంగా తీర్చిదిద్దుతామని స్పష్టం చేశారు.



మూసీ విషయంలో తమ ప్రభుత్వం అజెండా తెలపడానికి పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఏర్పాటు చేశామని వెల్లడించారు. మూసీపై ప్రతిపక్షాల నేతలు అనవసరపు విమర్శలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. బీజేపీ తెలంగాణలో ఒక అజెండాతో ఉందని.. దేశవ్యాప్తంగా మరో అజెండాతో ఉందని ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ నేతలకు తమ ప్రభుత్వంపై విమర్శలు చేసే హక్కు లేదని చెప్పుకొచ్చారు. ఆర్టీసీ కార్మికులకు అన్యాయం చేసిందే బీఆర్ఎస్ అని ఆగ్రహించారు. ఎలక్ట్రిక్ బస్సులను అమల్లోకి తీసుకురావడం కేంద్రప్రభుత్వం నిర్ణయమని తెలిపారు. అసెంబ్లీలో అన్నింటికి తాము సమాధానం చెబుతామని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు.

# గ్యాస్ కొరత లేదు..ఆందోళన వద్దు..!

**సంగారెడ్డి,ఫ్లాష్ ఇండియా :** గ్యాస్ సిలిండర్ల కొరత ఉందని, గ్యాస్ బుకింగ్ చేసిన కూడా సమయానికి రావడం లేదని ప్రజలు ప్రస్తుతం ఆందోళన చెందుతున్న విషయం తెలిసిందే. దీనిపై జిల్లా కలెక్టర్ ప్రావీణ్య స్పందించి గ్యాస్ సిలిండర్ల కొరత లేదని, ప్రజలు ఆందోళన చెందవద్దని ఆమె స్పష్టం చేశారు. గ్యాస్ సరఫరా పై సోషల్ మీడియాలో జరుగుతున్న తప్పుడు ప్రచారాలను ప్రజలు నమ్మవద్దని ఆమె సూచించారు. ఈ మేరకు శుక్రవారం కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించి జిల్లాలో గ్యాస్ సరఫరా పరిస్థితిపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గృహ వినియోగదారులతో పాటు ఆసుపత్రులు, విద్యా సంస్థలు, ప్రభుత్వ సంస్థలు, వసతి గృహాలు, అంగన్వాడి కేంద్రాలు, వృద్ధాశ్రమాలకు ప్రాధాన్యత క్రమంలో గ్యాస్ సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. గ్యాస్ కొరత పేరుతో నిల్వలు దాచడం, అక్రమంగా మళ్లించడం, బ్లాక్ మార్కెటింగ్ చేయడం వంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

**జిల్లాలో గ్యాస్ సరఫరా పై అపోహలు వీడండి**

గ్యాస్ వినియోగదారులు అవసరానికి మించి సిలిండర్లు బుక్ చేయకుండా నిబంధనల ప్రకారం పట్టణ ప్రాంతాల్లో 25 రోజులకు ఒకసారి, గ్రామీణ ప్రాంతాల్లో 45 రోజులకు ఒకసారి మాత్రమే బుకింగ్ చేసుకోవాలని సూచించారు. కమర్షియల్ అవసరాలకు డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లను వినియోగించరాదని, అధికారులు క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. అలాగే ప్రతిరోజు గ్యాస్ బుకింగ్‌లు, సరఫరా వివరాలను సేకరించి పూర్తి పర్యవేక్షణ చేయాలని తెలిపారు. అనంతరం జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ మాట్లాడుతూ ఎల్.పి.జి డిస్ట్రిబ్యూటర్లకు ఏదైనా సమస్య ఎదురైతే స్థానిక ఎస్‌హెచ్‌ఓ లేదా 100 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఎక్కడైనా డొమెస్టిక్ లేదా కమర్షియల్ గ్యాస్ సిలిండర్లను బ్లాక్ మార్కెటింగ్ చేస్తున్నట్లు తేలితే కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా పౌర సరఫరాల అధికారి బాలసరోజ, సహాయ పౌర సరఫరాల అధికారి రాజేశ్వర్, సంక్షేమ శాఖల అధికారులు అఖిలేష్ రెడ్డి, జగదీష్, రాజేశ్వర్, అంబదాస్, లలిత కుమారి, డీఈఓ వెంకటేశ్వర్లు, ఎల్పి.జి డిస్ట్రిబ్యూటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రతాప్ రెడ్డి, ఉపాధ్యక్షుడు మురళీధర్ రెడ్డి, సభ్యులు ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.


# సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌పై అభిశంసన..

**ఢిల్లీ :** భారత రాజకీయ చరిత్రలో సంచలన పరిణామంలో చోటుచేసుకుంది. ఓ ప్రధాన ఎన్నికల కమిషనర్‌ను పదవి నుంచి తొలగించాలని కోరుతూ.. ప్రతిపక్షాలు పార్లమెంటులో అభిశంసన తీర్మానాన్ని ప్రవేశపెట్టాయి. ఈ మేరకు సుమారు 190 మందికి పైగా ఎంపీలు సంతకం చేసిన నోటీసును ఇవాళ ఉభయ సభల్లోనూ సమర్పించారు. ఇండియా కూటమి పార్టీలు సీఈసీ జ్ఞానేష్ కుమార్ పై ప్రధానంగా ఏడు ఆరోపణలను నోటీసులో పేర్కొన్నాయి. అధికార బీజేపీకి అనుకూలంగా వ్యవహరిస్తూ, రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉండి పక్షపాత నిర్ణయాలు తీసుకుంటున్నారని విపక్షాలు ఆరోపిస్తున్నాయి. అదేవిధంగా ముఖ్యంగా పశ్చిమ బెంగాల్ వంటి రాష్ట్రాల్లో 'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్' పేరుతో అసలైన ఓటర్ల పేర్లను తొలగించారని, ఇది ఒక వర్గం ఓటర్లను లక్ష్యంగా చేసుకుని జరిగిందని ఆరోపించారు. ఓటర్ల జాబితా, ఎన్నికల ప్రక్రియలో జరిగిన అక్రమాలపై విచారణను ఉద్దేశపూర్వకంగా అడ్డుకుంటున్నారని పేర్కొన్నారు.

**అభిశంసన ప్రక్రియ ఇలా..**

రాజ్యాంగంలోని ఆర్టికల్ 324 (5) ప్రకారం, ప్రధాన ఎన్నికల కమిషనర్‌ను సుప్రీంకోర్టు న్యాయమూర్తిని తొలగించే పద్ధతిలోనే తొలగించాలి. అందుకు లోక్‌సభలో కనీసం 100 మంది, రాజ్యసభలో 50 మంది ఎంపీల సంతకాలు అవసరం. ఇప్పటికే 130 మంది లోక్‌సభ సభ్యులు, 63 మంది రాజ్యసభ సభ్యులు సంతకాలు చేశారు. ఒకవేళ స్పీకర్ నోటీసు అంగీకరిస్తే. ముగ్గురు సభ్యులతో కూడిన విచారణ కమిటీ ఆరోపణలను పరిశీలిస్తుంది. ఒకవేళ ఆరోపణలు నిజమని తేలితే, ఉభయ సభల్లోనూ 2/3 వంతు మెజారిటీతో తీర్మానం నెగ్గాల్సి ఉంటుంది. మరోవైపు విపక్షాల ప్రవేశపెట్టిన అభిశంసన తీర్మానాన్ని అధికార బీజేపీ తప్పుబట్టింది. రాజ్యాంగబద్ధమైన సంస్థలను ప్రతిపక్షాలు అప్రదిష్ట పాలు చేస్తున్నాయని, మెజారిటీ లేకపోయినా కేవలం రాజకీయం కోసమే ఇలా తప్పటడుగు వేస్తున్నాయని విమర్శించింది.

# సిలిండర్ల విషయంలో ఆందోళన వద్దు



**నిజామాబాద్,ఫ్లాష్ ఇండియా :** వంట గ్యాస్ సిలిండర్ల విషయంలో ప్రజలు ఎవ్వరు ఆందోళనకు గురి కావాల్సిన అవసరం లేదని కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. జిల్లా అవసరాలకు సరిపడా నిల్వలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నామని, జిల్లాలో గ్యాస్ కొరత ఎంత మాత్రం లేదని స్పష్టం చేశారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో శుక్రవారం కలెక్టర్ అధ్యక్షతన పర్యవేక్షక కమిటీ సమావేశం జరిగింది. జిల్లాలో వంట గ్యాస్ డిమాండ్, సరఫరా తీరుతెన్నుల గురించి ఈ సమావేశంలో సమీక్షించారు. జిల్లాలో 5,81,769 గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయని, 33 గ్యాస్ ఏజెన్సీల ద్వారా సరఫరా జరుగుతోందని తెలిపారు. శుక్రవారం 10,850 సిలిండర్లు జిల్లాలో గృహావసరాల కోసం పంపిణీ నిమిత్తం అందుబాటులో ఉన్నాయని, వీటికి అదనంగా మరో 5,875 సిలిండర్లు జిల్లాకు రానున్నాయని పౌర సరఫరాల శాఖ అధికారి శ్రీకాంత్ రెడ్డి కలెక్టర్ దృష్టికి తెచ్చారు. సిలిండర్ బుక్ చేసిన వారికి మూడు నుంచి నాలుగు రోజుల వ్యవధిలో గృహావసరాల సిలిండర్లు పంపిణీ చేయబడుతున్నాయని తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో ఎల్.పీ.జీ సిలిండర్ల పంపిణీని నిశితంగా పర్యవేక్షిస్తున్నామని అన్నారు. ఎవరైనా కృత్రిమ కొరతను సృష్టించి, బ్లాక్ మార్కెట్‌లో గ్యాస్ సిలిండర్లను విక్రయిస్తే, నిత్యావసర సరకుల చట్టం, 1955 ప్రకారం.. కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇప్పటికే తనిఖీలను ముమ్మరం చేయించామని, ప్రస్తుత మార్చి నెలలో ఎన్ ఫోర్స్ మెంట్ బృందాలు ఆకస్మిక దాడులు జరిపిన సందర్భంగా వాణిజ్య అవసరాలకు వినియోగిస్తున్న 156 డొమెస్టిక్ సిలిండర్లను వివిధ వ్యాపార, వాణిజ్య దుకాణాల నుండి స్వాధీనం చేసుకుని వాటి నిర్వాహకులపై కేసులు నమోదు చేశారని కలెక్టర్ వివరించారు. హోటళ్ళు, రెస్టారెంట్లలో కమర్షియల్ సిలిండర్ మాత్రమే ఉపయోగించాలని, డొమెస్టిక్ సిలిండర్లను వినియోగిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అన్ని ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాలు, రెసిడెన్షియల్ స్కూల్స్, గురుకులాలకు, ఆసుపత్రులకు, అంగన్వాడీ కేంద్రాలకు, అనాధశ్రమాలకు ఇండెంట్ లు అందిన వెంటనే జాప్యానికి తావు లేకుండా గ్యాస్ సిలిండర్లు సరఫరా చేయాలని ఏజెన్సీల నిర్వాహకులకు సూచించారు. విద్యార్థులు, రోగులు, వారి అటెండెంట్లకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకూడదని అన్నారు. ఆసుపత్రులలో ఇన్ పేషంట్ల సంఖ్యకు అనుగుణంగానే సిలిండర్లు ఇండెంట్ పెట్టేలా కట్టుదిట్టమైన పర్యవేక్షణ చేయాలని డీ.ఎం.హెచ్.ఓ ను ఆదేశించారు. ప్రస్తుతం జిల్లాలో గృహ అవసరాల కోసం వినియోగించే డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్ల కొరత ఎంతమాత్రం లేదని అన్నారు. ఎల్.పీ.జీ వినియోగదారులు ఆన్లైన్లో మాత్రమే సిలిండర్లను బుక్ చేసుకోవాలని, ఏజెన్సీల వద్దకు, గ్యాస్ గోదాముల వద్దకు వెళ్లవద్దని కలెక్టర్ కోరారు. గ్యాస్ బుకింగ్ కోసం సింగిల్ సిలిండర్ కి 25 రోజులు, డబుల్ సిలిండర్ కి 45 రోజుల వ్యవధి తర్వాత మాత్రమే బుకింగ్ నమోదు నిబంధన అమలులో ఉందన్నారు. వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి, నిర్ణీత వ్యవధి దాటిన తరువాతనే గ్యాస్ రీఫిల్ కోసం బుకింగ్ చేసుకోవాలని సూచించారు. కాగా, కొంతమంది వినియోగదారులు సిలిండర్ లో ఇంకను గ్యాస్ నిల్వలు కొంతవరకు మిగిలి ఉన్నప్పటికీ, కొత్తగా బుకింగ్ చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, ఈ తరహా ఆదుర్దాను ప్రదర్శించడం వల్ల గ్యాస్ విషయంలో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంటుందని, గ్యాస్ సిలిండర్ పూర్తిగా ఖాళీ అయి, నిర్ణీత వ్యవధి దాటిన అనంతరమే బుకింగ్ చేసుకోవాలని కలెక్టర్ హితవు పలికారు. గ్యాస్ డెలివరీ చేసే సమయంలో డెలివరీ బాయ్ కి ఓటీపీ చెప్పి సహకరించాలని, వారి విధులకు ఎవరైనా ఆటంకం కలిగించినట్లయితే, అలాంటి వినియోగదరులపైన కూడా చట్టపరముగా చర్యలు తీసుకోబడతాయని అన్నారు. ఎల్పీజీ వినియోగదారులు తప్పనిసరిగా కేవైసీ పూర్తి చేసుకోవాలని, గ్యాస్ ఏజెన్సీల వద్ద, ఆన్లైన్లో కానీ గ్యాస్ కంపెనీ అధికారిక వెబ్సైట్ లేదా యాప్ లో, గ్యాస్ సిలిండర్ పంపిణీ సమయంలో గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకుల వద్ద కేవైసీ పూర్తి చేసుకోవచ్చని సూచించారు. ఈ సమావేశంలో అదనపు డీ.సీ.పీ బస్వారెడ్డి, ఇంచార్జి అదనపు కలెక్టర్ దిలీప్ కుమార్, ఎ.ఎస్.ఓ అరవింద్ రెడ్డి, డీ.టీ.ఓ ఉమామహేశ్వర్ రావు, డీ.పీ.ఓ శ్రీనివాస్ రావు, డీ.డబ్ల్యూ.ఓ పద్మ, జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారిణి కృష్ణవేణి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వీరస్వామి, ఆర్ సీ ఓ లు, గ్యాస్ కంపెనీల సేల్స్ ఆఫీసర్లు, ఎల్.పీ.జీ డీలర్లు పాల్గొన్నారు.

# శశికళ కొత్త పార్టీ

**చెన్నై:** త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న తమిళనాడులో మరో రాజకీయ పార్టీ పురుడు పోసుకుంది. అన్నాడీఎంకే బహిష్కృత నేత, మాజీ సీఎం దివంగత జయలలిత సన్నిహితురాలు వీకే శశికళ కొత్త పార్టీని ప్రారంభిం చారు. పార్టీ పేరును 'ఆన్‌ఇండియా పురచ్చితలైవార్ మక్కలమునేత్ర కజగం'గా ప్రకటించారు. కొబ్బరి చెట్టును పార్టీగా నిర్ణయించారు. తన అనుచరులతో కలిసి మీడియా ఎదుట వివరాలు వెల్లడించారు. కొత్త పార్టీ జెండాలో మూడు రంగులు నలుపు, తెలుపు, ఎరుపు,అలాగే ప్రముఖ నాయకులు సీఎన్. అన్నాదురై, ఎంజీ రామచంద్రన్, జయలలిత చిత్రాలు కూడా జెండాపై ఉంటాయని తెలిపారు. కాగా శశికళ కొత్త పార్టీ ప్రారంభం తమిళనాడు రాజకీయాల్లో కొత్త చర్చకు దారి తీసింది. ఇప్పటికే ఉన్న పార్టీల మధ్య పోటీకి ఇది కొత్త మలుపు తీసుకురావచ్చని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

## సంపాదకీయం

# సంపద కేంద్రీకరణ..

ప్రపంచ దేశాలన్నింటిలోనూ సంపద కొంతమంది చేతుల్లో ఎన్నడూ లేని విధంగా కేంద్రీకరణ జరిగింది. సంపద కొంతమంది చేతుల్లో కేంద్రీకృతం అయితే ప్రజల ఆదాయాలు తగ్గి కొనుగోలు శక్తి పడిపోతుంది. దీంతో మార్కెట్‌లో డిమాండ్ తగ్గి ఉత్పత్తులు అమ్ముడుపోవు.. పెట్టుబడులు తగ్గి నిరుద్యోగం పెరుగుతుంది. ప్రజల ఆదాయాలు ముఖ్యంగా తగ్గి పేదరికంలోకి పోయే పరిస్థితి.నిజానికి వీరి అభివృద్ధి లేనిదే వారికి ఆదాయాలు అందనిదే ఆర్థిక వ్యవస్థ బతికి బట్ట కట్టలేదు. అందువల్ల ప్రభుత్వం జోక్యం చేసుకుని ప్రజల ఆదాయాలు పెంచే విధంగా, అసమానతలు తగ్గే విధంగా ఉద్యోగ అవకాశాలు పెంచితే ఆర్థిక వ్యవస్థ బలపడుతుంది.

**నయా ఉదారవాద విధానాల వలన..**

1930లలో ఆర్థిక మాంద్యం సమయంలో కీన్స్, ప్రపంచ దేశాలు ఈ మాంద్యం నుండి బయటపడేందుకు ప్రజల కొనుగోలు శక్తి పెంచాలని సూచించాడు. ప్రభుత్వం ఉపాధి కల్పించి ప్రజల ఆదాయాలు పెంచితేనే ఆర్థిక వ్యవస్థలో ఎఫెక్టివ్ డిమాండ్ పెరిగి మాంద్యం తగ్గుతుందని చెప్పాడు. ఈ కినీషియన్ విధానాల ప్రకారం ప్రభుత్వ ఖర్చులు, ముఖ్యంగా సైనిక వ్యయం పెంచడంతో అనేక దేశాలు ఆర్థిక మాంద్యం నుంచి బయటపడ్డాయి. కానీ నేడు ఈ విధానాల నుండి పాలకులు నయా ఉదారవాద విధానాల వైపు మళ్లిన తర్వాత సమాజంలో అసమానతలు సంపద కేంద్రీకరణ జరిగి కార్మికులను దారిద్రం లోకి నెట్టివేసినారు. ప్రపంచ దేశాలన్నీ నేడు ఆర్థిక మాంద్యంలోకి పోయే పరిస్థితి ఏర్పడింది. జాతీయ ఆదాయాలలో కార్మికుల వాటా గణనీయంగా తగ్గిపోయింది. గుత్త పెట్టుబడిదారుల సంఖ్య మాత్రం భారీగా పెరిగిపోతోంది. ముఖ్యంగా నూతన ఆర్థిక విధానాలు చేపట్టిన తర్వాత మనదేశంలో ఒక్కరిగా ఉన్న బిలినియర్, నేడు 350కి పెరిగిపోయారు.. ఆర్థిక సంస్కరణల ప్రయోజనాలను కొందరు పారిశ్రామికవేత్తలు పొందుతున్న తీరు అందుకు పాలకులు సహకరిస్తున్న విధానం కారణంగా సంపన్నులు మరింత సంపన్నులు అవుతున్నారు. ముఖ్యంగా కార్పొరేట్లకు పన్నుల విధానం వలన ప్రభుత్వ ఆదాయానికి భారీగా నష్టం అవుతున్నది.

**ధనిక, పేద మధ్య భారీ అసమానతలు..**

దేశంలో బిలీనియర్ల సంఖ్య పెరిగే కొలది ఆదాయ సమానతలు విపరీతంగా పెరిగి ప్రజలపై ప్రభుత్వాలు చేసే అణిచివేత ధోరణలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. ఈ 350 మంది నయా కుబేరుల సంపద జాతీయ ఆదాయం పెరుగుదలలో 25 శాతంగా ఉంది. దేశం తలసరి ఆదాయం ప్రస్తుతం మూడు వేల డాలర్లు ఉండగా, ఉన్నత ఆదాయ వర్గాలపై భాగంలో ఉన్న 10 శాతం ధనికుల తలసరి ఆదాయం 14 వేల మిలియన్ డాలర్లుగా ఉంది. ఇలా పేదలకు ధనికులకు మధ్య ఆర్థిక అసమానతలు ఎన్నడూ లేని విధంగా పెరిగిపోయాయి. దేశంలో తీవ్రమైన ఆర్థిక అసమానతలు పెరిగాయి. టాప్ 10% ప్రజల వద్ద 77% సంపద ఉండగా, కింది 50% ప్రజల వద్ద కేవలం 4.1% మాత్రమే ఉంది. రాఇటుఐ నివేదిక ప్రకారం 2022--23లో 1% ప్రజలు 22.3% జాతీయ ఆదాయాన్ని పొందారు. ఇది ఒకప్పటి రాచరిక వ్యవస్థలో అసమానతల కంటే ఎక్కువ. ఈ అసమానతలు ప్రజా శ్రేయస్సును దెబ్బతీస్తున్నాయి. వరల్డ్ ఎకనామిక్ ఫోరం సమావేశంలో 24 దేశాల 400 మంది ధనవంతులు తమపై ఎక్కువ పన్నులు విధించాలని కూడా కోరారు. ప్రజలకు చెందాల్సిన వనరులు కొద్ది మందికి వెళ్లడం వల్ల సంపద కేంద్రీకరణ పెరిగి సామాజిక- ఆర్థిక సమస్యలు తీవ్రం అవుతున్నాయి. దేశంలో అసమానతలను, దోపిడీని రూపుమాపేందుకు పుట్టిన మావోయిస్టు పార్టీని ఆపరేషన్ కగార్‌తో నామరూపాలు లేకుండా చేస్తున్నారు.

**ప్రజా ఉద్యమాలు తప్పవేమో?**

బ్రిటిష్ పాలన తర్వాత దేశంలో సంపద కొద్దిమంది బిలియనీర్ల చేతుల్లో కేంద్రీకృతమైందని విమర్శలు ఉన్నాయి. 25% ధనికుల వద్ద సుమారు 80% భూమి ఉండగా, 41% రైతులకు భూమి లేదు. 1997--2022 మధ్య సుమారు మూడు లక్షల రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. ఈ పరిస్థితుల్లో యువత వలసలు పెరిగాయి, రైతు వ్యతిరేక విధానాలపై ఎన్నికల్లో కూడా అసంతృప్తి వ్యక్తమైంది. 1960--70లతో పోలిస్తే నేడు అసమానతలు మరింత పెరిగాయని చర్చ జరుగుతోంది. కుబేరుల అండదండలతో మేము పాలకులుగా ఉండాలని ప్రజా హక్కుల పోరాటాన్ని అణగదొక్కుతూ ప్రమాదంలోకి పడవేస్తున్నారు పాలకులు.. కాబట్టి ప్రజా హక్కులు, సమాన అవకాశాలు, ఆర్థిక న్యాయం కోసం ప్రజా ఉద్యమాలు అవసరమనే అభి ప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

# సారూ.. మీకు తెలీదా..?

ఇసుక.. బుసక, మట్టి..మశానం, కుదిరితే స్మశానం సైతం... దొరికింది దోచెయ్... కన్ను పడితే కబ్జా చేసెయ్ అన్నట్టుగా ఉందట అక్కడ వ్యవహారం. సాక్షాత్తు ఆంధ్రప్రదేశ్ మంత్రివర్యులు, అందునా దశాబ్దాల రాజకీయ చరిత్ర ఉన్న సీనియర్ ప్రాతినిధ్యం వహిస్తున్న చోటే ఇలాంటి ఆరోపణలు పెరిగిపోతున్నాయి. మరి ఈ సంగతి మంత్రిగారికి తెలీదా..? లేక తెలిసినా ఆ.... మనోళ్ళే కదా, అధికారం ఉన్నప్పుడు ఆ మాత్రం చేయకుంటే కిక్కేముంటుందని చోద్యం చూస్తున్నారా? ఎవరా మినిస్టర్? నెల్లూరు జిల్లా ఆత్మకూరు అసెంబ్లీ సెగ్మెంట్. రాష్ట్ర మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఇక్కడి నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. మరి ఆయనకు తెలుస్తోందో లేదోగానీ.... అనుచరులు చేస్తున్న అడ్డగాలు దందాల గురించి లోకల్‌లో విపరీతంగా గుసగుసలాడేసుకుంటున్నారు. చివరికి చికెన్ షాపుల్లోని వేస్ట్‌ని కూడా వదలకుండా టీడీపీ నాయకులు వేళ్ళు పెడుతున్నట్టు చెప్పుకుంటున్నారు.పనికిరావని పడేసే కోడి వ్యర్థాలతోనే వీళ్ళు దందా చేస్తున్నారంటే ఇక ఇసుక, మట్టి, మైనింగ్ లాంటి వాటి గురించి వేరే చెప్పాలా అంటున్నారు స్థానికులు. మంత్రి ఆనం అప్పుడప్పుడు మాత్రమే నియోజకవర్గంలో తిరుగుతున్నారని, దీన్ని అడ్వాంటేజ్‌గా తీసుకుని నియోజకవర్గ టీడీపీ నాయకులు ప్రకృతి సంపదను చెరబడుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. వందల కోట్లతో అభివృద్ధి పనులు చేస్తున్నామని ఓవైపు మంత్రి చెబుతుంటే.... మరోవైపు ఆయన అనుచరులు మాత్రం ఎడాపెడా అక్రమాలకు పాల్పడుతున్నారన్నది లోకల్ టాక్. నియోజకవర్గంలోని ఆత్మకూరు, సంగం, చేజర్ల, అనంతసాగరం మండలాల మీదుగా పెన్నా నది ప్రవహిస్తోంది. ఈ మండలాలన్నిటిలో అధికార, అనధికార ఇసుక రీచ్‌లు ఉన్నాయి. కొన్నిచోట్ల ఎలాంటి అనుమతులు లేకుండా రాత్రింబవళ్లు ఇసుక తోడేస్తూ... కోట్లకు పడగెత్తుతున్నారు అక్రమార్కులు. అంతా అధికార పార్టీ నేతలే కావడంతో పోలీసులు కూడా మాకేం కనిపించడం లేదన్నట్టుగా ఉంటున్నారట. అక్రమంగా తిరుగుతున్న భారీ టిప్పర్ల కారణంగా గతంలో పెరమన సమీపంలో రోడ్డు ప్రమాదం జరిగి ఏడుగురు బలయ్యారు. ఆ కేసులో ప్రధాన నిందితుడిని పోలీసులు తప్పించారన్న ఆరోపణలు ఉన్నాయి.చేజర్ల మండలం పడమటి కంభంపాడు నుంచి అనుమతులకు విరుద్ధంగా ఇసుక అక్రమ రవాణా జరుగుతున్నా... మైనింగ్ అధికారులు కన్నెత్తి కూడా చూడడం లేదని చెప్పుకుంటున్నారు. మంత్రి ఇలాకా కావడంతో అధికారులు కూడా ధైర్యం చేయలేకపోతున్నారన్నది



ఇంకో వెర్షన్. ఇక సంగం మండలం దువ్వూరు సమీపంలో చికెన్ వెస్టేజ్ అక్రమ రవాణా జరుగుతోంది. ఈ విషయాన్ని ఇటీవల మాజీ ఎమ్మెల్యే విక్రమ్ రెడ్డి ప్రస్తావించారు. షాపుల నుంచి కలెక్ట్ చేసిన చికెన్ వేస్ట్‌ను తీసుకెళ్ళి చెరువుల్లోని చేపలకు వేస్తున్నారని, ఆ చేపలను మంత్రికి పంపిస్తా...... ఆయన తింటారా అంటూ ఘాటుగా ప్రశ్నించారు విక్రమ్‌రెడ్డి. మరోవైపు ఏఎస్ పేట మండలానికి చెందిన కీలక నేతతో పాటు.. చేజర్ల మండలానికి చెందిన ఓ హాస్పిటల్ నిర్వాహకుడు కూడా.. మంత్రి ఆనం పేరు చెప్పుకొని అవినీతి వ్యవహారాలు నడిపిస్తున్నారన్న గుసగుసలు పెరిగిపోతున్నాయి. వీటన్నిటిని ఆనం రామనారాయణరెడ్డి చుట్టూ ఉండే కోటరీ పర్యవేక్షిస్తోందన్నది ఇంటర్నల్ టాక్.మేటర్ ఆయన దృష్టికి వెళ్తోందో లేదోగానీ... అనుచరులు మాత్రం అవినీతి అనకొండలుగా మారారని నియోజకవర్గ టీడీపీ కార్యకర్తలే మాట్లాడుకుంటున్నారు. అదే సమయంలో మేం ఇంతకు ముందు చూసిన ఆనం వేరు, ఇప్పుడు చూస్తున్న ఆనం వేరు అన్న మాటలు సైతం వినిపిస్తున్నాయి. అటు నెల్లూరుపాలెం సమీపంలోని ఓ లేఔట్ వ్యవహారాన్ని కూడా స్థానిక టీడీపీ నేతలు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారట. క్షేత్రస్థాయిలో జరుగుతున్న అవినీతి గురించి పెద్దాయనకు చెప్పే పరిస్థితి లేదని, అందుకే నేరుగా అధికారుల దృష్టికే తీసుకువెళ్తున్నామన్నది టీడీపీ నేతల మాట. నియోజకవర్గంలో ఇసుక, గ్రావెల్ దోపిడీ గురించి అయితే మాట్లాడే పనే లేదని అంటున్నారు పాత తరం తెలుగుదేశం నాయకులు. అవినీతి, అక్రమాలపై ఓ వైపు వైసీపీ, మరో వైపు ఆనం వ్యతిరేక శిబిరం సంధిస్తున్న ప్రశ్నలకు సమాధానం చెప్పలేకపోతే భవిష్యత్‌లో భారీ మూల్యమే చెల్లించుకోవాల్సి వస్తుందన్న మాట టీడీపీలోనే వినిపిస్తోంది.



# మాజీ మావోయిస్టుల అడుగులు ఎటువైపు?

మాజీ మావోయిస్టులు దేవ్‌జీ, మల్లా రాజిరెడ్డి తదితరులు గురువారం సీపీఐ ఆఫీసుకు వస్తారని వచ్చిన వార్తల నేపథ్యంలో తెలంగాణ రాజకీయాల్లో కొత్త చర్చ మొదలైంది. వారి కార్యక్రమం రద్దయినా చర్చ మాత్రం కొనసాగుతూనే ఉంది. గత నెలాఖరులో డీజీపీ శివధర్‌రెడ్డి సమక్షంలో లొంగిపోయిన దేవ్‌జీ వర్గం.. తాము రాజకీయ జీవితం కొనసాగిస్తామని, చట్టబద్ధమైన పద్ధతుల్లో ప్రజల పక్షాన పోరాడతామని చెప్పిన విషయం తెలిసిందే. దీంతో వారి తదుపరి ప్రయాణంపై విప్లవోద్యమ అభిమానులు, రాజకీయ పరిశీలకుల్లో ఆసక్తి నెలకొన్నది. అక్టోబర్‌లో లొంగిపోయిన 'సోనూ-ఆశన్న' వర్గం.. అనంతరం సరెండర్ అయిన 'దేవ్‌జీ' వర్గాలు రెండూ కలిసి ఒకే వేదిక ఏర్పాటు చేసుకుని పోరాడవచ్చు కదా.. అనేదే ఈ చర్చ సారాంశం.

**కొత్తదారి కోసం..**

కొత్త రాజకీయ వేదిక కోసం ఆలోచిస్తున్నామని మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూల్లో సోనూ ఇప్పటికే పలుమార్లు చెప్పారు. గతవారం రాయ్‌పూర్ వెళ్లి ఛత్తీస్‌గఢ్ అసెంబ్లీ కార్యకలాపాలను పరిశీలించిన ఆశన్న టీం.. ఈ వారం తెలంగాణకు వచ్చి వెళ్లింది. వారి 5 రోజుల పర్యటనలో తమ కుటుంబాల సందర్శనతోపాటు వరంగల్ సమీపంలోని బట్టుపల్లిలో అమరుల కుటుంబాలను వారు పరామర్శించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన ఆశన్న.. తాము చట్టబద్ధంగా పనిచేసే కొత్త దారి కోసం వెతుకుతున్నామని, ఇప్పుడున్న పార్టీల్లో అయితే చేరబోమని స్పష్టం చేశారు. తాము తొందర పడదల్చుకోలేదని, నలభై ఏళ్లుగా అన్నీ త్యాగం చేసిన తాము ఇకముందు కూడా ప్రజల కోసమే పనిచేస్తామని స్పష్టం చేశారు.

**ఇద్దరి మార్గం ఒకటేనా..**

'సోనూ-ఆశన్న' వర్గం లొంగిపోయినప్పుడు వారిపై ద్రోహులు అంటూ ముద్ర వేసిన 'దేవ్‌జీ' వర్గం తాజాగా తాము కూడా చట్టబద్ధంగా పనిచేస్తామని చెప్పారు. దీంతో ఇద్దరి దారుల్లో తేడా ఏముందని విప్లవాభిమానులు, పరిశీలకులు ప్రశ్నిస్తున్నారు. ఆయుధాలు అప్పగించడం, అప్పగించకపోవడం కూడా ఇప్పుడు సమస్య కాదని, అందరూ చేసింది అదే కదా? అంటున్నారు. బయటకు రావడానికి కారణం.. దీర్ఘకాలిక సాయుధ పోరాట పంథా విఫలమైందని, తాత్కాలిక పోరాట విరమణే తక్షణ మార్గమని సోనూ వర్గం చెప్పి లొంగుబాట పట్టిందని, దేవ్‌జీ, మల్లా రాజిరెడ్డి, చంద్రన్న, సుజాతక్క తదితరులు మాత్రం అనారోగ్యం, వృద్ధాప్యం.. అంటూ ఇతర కారణాలు చెప్పారని గుర్తుచేస్తున్నారు. కానీ భవిష్యత్ కార్యాచరణకు సంబంధించిన మాత్రం ఇద్దరూ చట్టబద్ధ పోరాటమే చేస్తామని ప్రకటించారని అంటున్నారు.

**మొత్తం 3 వేలమంది పైనే..**

భవిష్యత్ కార్యాచరణపై ఇద్దరి మధ్య పెద్దగా వైరుధ్యాలు లేనప్పుడు రెండు వర్గాలు ఏకమైతే బలమైన వేదిక తయారవుతుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. 2024 జనవరిలో ఆపరేషన్ కగార్ మొదలైనప్పటి నుంచి 2026 మార్చి 10 వరకు మొత్తం 2,650 మందికి పైగా మావోయిస్టులు లొంగిపోయినట్లు నివేదికలు స్పష్టం చేస్తున్నాయని, జైల్లో ఉన్నవారి సంఖ్య కలిపితే, ఇది మూడు వేలకు చేరవచ్చని అంటున్నారు. ఇంతమంది పూర్తికాలం పనిచేస్తూ ఒక రాజకీయ పార్టీ లేదా వేదికను ఏర్పాటు చేసి నడిపిస్తే అనతికాలంలోనే ఒక బలమైన శక్తిగా ఎదిగే అవకాశం ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

**వామపక్షాలు కూడా కలిస్తే..**

దేవ్ జీ వర్గాన్ని తమ ఆఫీసుకు ఆహ్వానించిన సీపీఐ, సీపీఐ(ఎం), సీపీఐ(ఎంఎల్) గ్రూపులు కనుక మాజీ మావోయిస్టులతో ఏకమైతే, దేశ రాజకీయాల్లో కీలక మార్పు వచ్చే అవకాశముందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. దేశవ్యాప్తంగా కాంగ్రెస్ బలహీనమవుతున్న పరిస్థితుల్లో ఇది మంచి ప్రత్యామ్నాయంగా మారవచ్చని కూడా అంచనా వేస్తున్నారు. తెలంగాణ సాయుధ పోరాటం నుంచి నక్సల్బరీ-శ్రీకాకుళ పోరాటాలు, ఇప్పుడు మావోయిస్టుల దీర్ఘకాలిక సాయుధ పోరాటం ఫలించని నేపథ్యంలో అన్ని కమ్యూనిస్టు పార్టీలు కలిసి కొత్తదారి కోసం అన్వేషించడంలో తప్పేముందని ప్రశ్నిస్తున్నారు. సోనూ-ఆశన్న, దేవ్‌జీ వర్గాలు ఈ కోణంలో ఆలోచించాలని, తమ మధ్య ఉన్న ఇతర విభేదాలను పక్కన పెట్టి ప్రజల మేలు కోసం కలవాలని సూచిస్తున్నారు.

# పొగడ్తల వెనక...!

## సీఎం రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే పొగడ్తల జడివాన

ఆ బీఆర్ఎస్ ఎమ్మెల్యేకి ఉన్నట్టుండి సీఎం రేవంత్‌రెడ్డి మీద ఎందుకు ప్రేమ పెరిగిపోయింది? పైగా పొగడ్తల జడివాన కురిపించడం వెనకున్న రీజన్ ఏంటి? ఆ ప్రేమ వరద పారడానికి కారణం రాజకీయ కారణాలా? లేక వ్యక్తిగత వ్యవహారాలా? అభివృద్ధి కోసం మీతో కలిసి నడుస్తానని చెప్పడం వెనకున్న ఆంతర్యం ఏంటి? ఎవరా గులాబీ ఎమ్మెల్యే? ఏంటా ప్రశంసల పదనిసలు? ముఖ్యమంత్రిని ప్రసన్నం చేసుకోవడానికి, ఆయన దృష్టిలో పడటానికి అధికార పార్టీ ఎమ్మెల్యేలు తపించిపోవడం సహజం. అందుకోసం కొంతమంది కొన్ని సందర్భాల్లో బోర్డర్స్ క్రాస్ చేస్తుంటారు కూడా. కానీ... ఇప్పుడు తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డిని ప్రతిపక్ష బీఆర్ఎస్‌కు చెందిన ఎమ్మెల్యే పొగడ్తలతో ముంచెత్తడం గురించి హాట్ హాట్‌గా చర్చలు నడుస్తున్నాయి. గ్రేటర్ హైదరాబాద్‌లో అత్యంత కీలకమైన సెగ్మెంట్స్‌లో ఒకటైన కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు రేవంత్‌ను ఆకాశానికెత్తేయడం వెనకున్న ఆంతర్యం ఏంటా అని ఆరా తీస్తున్నాయి రాజకీయవర్గాలు.ఆ మధ్య కూకట్‌పల్లి నియోజకవర్గం పరిధిలో జరిగిన ఓ బహిరంగ సభలో ఎమ్మెల్యేని గట్టిగానే టార్గెట్ చేశారు రేవంత్. కేసీఆర్, కేటీఆర్, హరీష్‌రావు, ఎర్రబెల్లి దయాకర్‌రావును ఉద్దేశించి విమర్శిస్తున్న క్రమంలో మాధవరంను కూడా కలిపేశారు ముఖ్యమంత్రి. అలాగే రెండు మూడు సభల్లో మాధవరం కృష్ణారావు పేరు ప్రస్తావించి మరీ... తిట్టినా బీఆర్ఎస్ ఎమ్మెల్యే రియాక్ట్ అవలేదు. కానీ... అదే సమయంలో తనపై ఆరోపణలు చేసిన తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవితకు స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు మాధవరం. దాంతో ఏదో ఒక సందర్భంలో సీఎం వ్యాఖ్యల మీద కూడా రియాక్ట్ అవుతారని అనుకున్నారు అంతా. కానీ... ఇప్పుడాయన వ్యవహారశైలి అందుకు పూర్తి భిన్నంగా ఉంది. గత సోమవారం కూకట్‌పల్లి నియోజకవర్గ పరిధిలోని నల్ల చెరువు ప్రారంభోత్సవ కార్యక్రమంలో సభకు అధ్యక్షత వహించారు కృష్ణారావు.ఆ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో తనకున్న అనుబంధాన్ని చెప్పుకొచ్చారాయన. తామిద్దరం గతంలో తెలుగుదేశం పార్టీలో కలిసి పని చేసిన సంగతుల్ని గుర్తు చేశారు. అలాగే... రేవంత్ రెడ్డి ఎంపీగా ఉన్నప్పుడు ఒక ప్రారభోత్సవశీలో కొబ్బరికాయ కొట్టమంటే.... ముఖ్యమంత్రిగా వచ్చి కొడతానని చెప్పారంటూ ఫ్లాష్ బ్యాక్ రింగులు తిప్పేశారు ఎమ్మెల్యే. అనుకున్నది సాధించే వ్యక్తి రేవంత్ రెడ్డి అని తెగ పొగిడేశారు. అక్కడితో ఆగితే అది వేరే సంగతిగానీ... ప్రసంగం చివర్లో... అభివృద్ధి పరంగా తాను ముఖ్యమంత్రితో పాటు కలిసి నడవడానికి సిద్ధంగా ఉన్నానని కొసమెరుపు మాటలు చెప్పడం చుట్టూనే ప్రస్తుతం పొలిటికల్ చర్చలు జరుగుతున్నాయి. అదే సమయంలో అంతకు ముందు రెండు సందర్భాల్లో మాధవరం కృష్ణారావును తీవ్రంగా విమర్శించిన రేవంత్... ఈ మీటింగ్‌లో ఒక్క మాట కూడా అనలేదంటూ ఎమ్మెల్యే అనుచరగణం కూడా హ్యాపీగా ఉందట.నోరు మంచిదైతే వూరు మంచిదవుతుందన్న సామెతను గుర్తు చేసుకుంటున్నారు. అది మాత్రమే కాకుండా ఈ సభలో రేవంత్ రెడ్డి బీఆర్ఎస్ పెద్దలు ఎవర్నీ విమర్శించలేదని గుర్తు చేస్తున్నారు. మిగతా ఏ మీటింగ్స్‌లో అయినా సరే... బీఆర్ఎస్ ముఖ్యుల మీద తీవ్రంగా విరుచుకుపడే ముఖ్యమంత్రి ఇక్కడ మాత్రం మాధవరం కృష్ణారావు తీసుకున్న జాగ్రత్తల వల్లే ఏమీ అనలేదని విశ్లేషిస్తున్నారు. అదంతా ఒక ఎత్తయితే... కూకట్‌పల్లి ఎమ్మెల్యే ఏం తక్కువైనోడు కాదని, ప్రస్తుతం తన కొడుక్కి సంబంధించిన రియల్ ఎస్టేట్ వ్యాపారం, కంపెనీలు దెబ్బతినకుండా ఉండటం కోసమే... సీఎం మీద పొగడ్తల వాన కురిపించారంటూ గుసగుసలాడుకుంటున్నారు కొందరు. ఎవరి వాదన ఎలా ఉన్నా... ఈ మార్పు మాత్రం పొలిటికల్ గాట్ అయింది.





సంపాదకీయం పేజీలో రచనలు పంపవలసిన వాట్సప్ నంబర్ ,మెయిల్ ఐడి 9951512539 flashindia999@gmail.com

# నిఘా ఎక్కడ?

## నిబంధనలు పక్కనపెట్టి భూ రిజిస్ట్రేషన్లు!

**వరంగల్,ఫ్లాష్ ఇండియా :** ఉమ్మడి జిల్లా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో జరుగుతున్న భూ రిజిస్ట్రేషన్లపై నిఘాలు లేవు. నిత్యం జరుగుతున్న రిజిస్ట్రేషన్లపై ఆడిటింగ్‌లు లేవు. కొత్త వెంచర్ల ప్లాట్స్ రిజిస్ట్రేషన్ సమయంలో పూర్తిస్థాయిలో రెవెన్యూ పత్రాల పరిశీలన లేదు. గ్రేటర్ వరంగల్ నగర శివారులో కుడా పరిధిలో పదుల సంఖ్యలో వెంచర్లు వెలుస్తున్నాయి. వీటిలో కొన్నింటికి పూర్తిసా-ధయిలో అనుమతులు లేకున్నా ప్లాట్లు రిజిస్ట్రేషన్లు అవుతున్నాయని ఆరోపణలు వస్తున్నాయి. డాక్యుమెంట్స్ పరిశీలన లేకుండానే పాత పత్రాల ఆధారంగా రిజిస్ట్రేషన్లు చేస్తున్నారు. ఈ ప్లాట్ల రిజిస్ట్రేషన్ లో వేలాది రూపాయలు చేతులు మారుతుండగా కొన్నవారు మాత్రం ఇబ్బందులకు గురవుతున్నారు. అంతా ఆన్ లైన్ అయినా మధ్యవర్తులు లేనిదే రిజిస్ట్రేషన్ లు కొన్ని కార్యాలయాల్లో కావడం లేదు. గ్రేటర్ వరంగల్ నగరంతో పరిధిలో వ్యవసాయ భూముల్లో పదుల సంఖ్యలో వెంచర్లు వెలుస్తున్నాయి. నగరం పరిధి దాటితే వెలిసే వెంచర్లకు కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ అనుమతులు తీసుకోవాలి. గ్రామ పంచాయతీ నుంచి అనుమతులు తీసుకొని నాలా కన్వర్షన్ చేసిన తర్వాతనే ప్లాట్స్ రిజిస్ట్రేషన్లు చేయాలి.. శివారు పరిధిలో రింగ్ రోడ్, బైపాస్ రోడ్, ఔటర్ రింగ్ రోడ్, నేషనల్ హైవేల వెంట ఈ వెంచర్లు ఎక్కువగా వెలుస్తున్నాయి. ఈ వెంచర్ల పరిధిలో కొంతమంది కూడా అనుమతులు తీసుకొని ప్లాట్లు చేస్తుండగా మరికొంత మంది గ్రామ పంచాయతీల అనుమతులు తీసుకొని పనులు చేస్తున్నారు. వీటన్నింటికి పూర్తి స్థాయి అనువ-ుతులు ఉండాలి. వెంచర్లలో 10 శాతం భూములు అభివృద్ధి కోసం పంచాయతీలకు అప్ప చెప్పాలి. నాలా కన్వర్షన్ చేసిన తర్వాతనే ప్లాట్లను అమ్మకాలు చేయాలి.

**ఇష్టారాజ్యంగా చేస్తున్న రిజిస్ట్రేషన్లు**

ఉమ్మడి జిల్లా పరిధిలోని కొన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఇష్టారాజ్యంగా రిజిస్ట్రేషన్లు చేస్తున్నట్లు ఆరోపణలు వచ్చాయి. ఇండ్ల స్థలాల సంబంధించి ఆన్ లైన్ లో పత్రాలు సబ్మిట్ చేస్తూ ఫీజులు చెల్లిస్తున్నారు. వాటికి సంబంధించిన పత్రాలను తీసుకువచ్చి రిజిస్ట్రేషన్లు చేస్తున్నారు. నగర శివారు పరిధిలోని హసన్ పర్తి, ధర్మసాగర్, ఎల్కతుర్తి, భీమదేవరపల్లి, కమలాపూర్, వర్ధన్నపేట, ఐనవోలు, ఖాజిపేట, స్టేషన్ ఘన్పూర్, వేలేర్, దామెర, ఆత్మకూర్, వరంగల్ ఖిల్లా, సంగెం మండలాల పరిధిలో వెంచర్లు ఎక్కువగా వెలిశాయి. రిజిస్ట్రేషన్లు చేసే సమయంలో అన్ని డాక్యుమెంట్లను పరిశీలించి చేయాలి. వ్యవసా-య భూములు వెంచర్లుగా మారిస్తే నాలా కన్వర్షన్లు, కుడా అనుమతులు, గ్రామ పంచాయతీ అనుమతులు తీసుకున్న తర్వాతనే చేయాలి. వీటిని ఆన్ లైన్ లో ఉన్న రెవెన్యూ పత్రాలతో సరిపోల్చి రిజిస్ట్రేషన్లు చేయాలి. ఏవైనా నిషేదితంగా ఉంటే నిలిపివేయాలి. అనుమతులు లేని ప్లాట్స్ రిజిస్ట్రేషన్ లేని సమ-యంలో తిరకాసు మొదలవుతుంది. వెంచర్ల యజమానులు కాసులు పెట్టి బ్రోకర్ల ద్వారా పైరవీలు చేస్తున్నారు. ప్లాట్స్ రిజిస్ట్రేషన్లు మేనేజ్ అయ్యే విధంగా చేస్తున్నారు. భూములకు రిజిస్ట్రేషన్లు చేయడంతో పాటు వేల రూపా-యలు కాసులు ఖర్చు చేస్తున్నారు. నగరం పరిధిలోని రిజిస్ట్రేషన్ కు ఈ వెంచర్లకు తక్కువగా ఈ పత్రాలు వస్తుండగా ఉమ్మడి జిల్లా పరిధిలో ముఖ్యంగా పాత తాలూకా కేంద్రాల్లో ఉన్న వాటిలో ఎక్కువగా జరుగుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. వివాదాస్పద డాక్యుమెంట్లు చేసే సమయంలో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాల్సి ఉన్నా పట్టించుకోవడం లేదని తెలుస్తోంది.

**పైరవీల ద్వారా పనులు!**

పైరవీల ద్వారా పనులు పూర్తి చేస్తున్నట్లు సమాచారం. పలు దఫాలు విజిలెన్స్, ఎన్ ఫోర్స్ మెంట్, ఏసీబీ తనిఖీలు చేపట్టిన ఇవి మాత్రం పూర్తి కావడం లేదు. ఈ దోపిడీ ఆగడం లేదు. ప్రతి కార్యాలయంలో బ్రోకర్లు లేనిదే పనులు కావడం లేదు. వెంచర్లు, కొనే వారి వద్ద డబ్బులు పెద్ద ఎత్తున వసూలు చేస్తున్నారు. డాక్యుమెంట్లను బట్టి రిజిస్ట్రేషన్ కు డబ్బులు బ్రోకర్లు వసూలు చేస్తున్నారు. శివారు భూములపై కుడా పరిధిలోని భూములపై ముఖ్యంగా వెంచర్లపై అధికారులు దృష్టి పెడితే కోట్ల రూపాయల ఆదాయం ప్రభుత్వానికి వచ్చే అవకాశం ఉంది.



# అమెరికాకు మైండ్ బ్లాంక్..

**ఇరాక్ :** పశ్చిమాసియా లో ఉద్రిక్తతలు తార-స్థాయికి చేరిన వేళ ఇరాక్ భూభాగంలో అమెరికాకు చెందిన భారీ యుద్ధ విమానం కూలిపోవడం కలకలం రేపుతోంది. అమెరికా వైమానిక దళానికి చెందిన KC-135 స్ట్రాటోట్యాంకర్ రీఫ్యూయలింగ్ విమానం ఇరాక్ పశ్చిమ ప్రాంతంలో కూలిపోయినట్లు అధికారులు ధృవీకరించారు. ఈ ప్రమాదంలో ఆరుగురు అమెరికా సైనికులు మరణించారని ఇరాన్ మీడియా ప్రతినిధులు పేర్కొన్నారు. అమెరికా విమానాన్ని తామే కూల్చివేసినట్లు కొన్ని ఇరాన్ అనుకూల వర్గాలు సోషల్ మీడియాలో ప్రచారం చేస-్తున్నాయి.

**అమెరికా రియాక్షన్..**

అయితే, ఇరాన్ వాదనలను అమెరికా రక్షణ శాఖ తోసిపుచ్చింది. విమానం కూలిపోయిన మాట వాస్తవమేనని, అయితే ఇది శత్రువుల దాడి వల్ల జరగలేదని స్పష్టం చేసింది. సాంకేతిక లోపం లేదా ప్రమాదవశాత్తూ రెండు విమానాలు ఒకదానికొకటి తగిలి ఉండవచ్చని ప్రాథమికంగా భావిస్తున్నారు. ఈ ఘటనలో మరొక విమానం సురక్షితంగా ల్యాండ్ అయినట్లు యూఎస్ సెంట్రల్ కమాండ్ తెలిపింది. ఇరాన్‌కు వ్యతిరేకంగా అమెరికా చేపట్టిన 'ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ'లో భాగంగా ఈ విమానం విధులు నిర్వహిస్తోంది. విమానంలో ఉన్న ఐదుగురు లేదా ఆరుగురు సిబ్బంది కోసం గాలింపు చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి.

# 'ప్రైవేట్' దందాల్లో ప్రభుత్వ టీచర్లు..

**ఆదిలాబాద్,ఫ్లాష్ ఇండియా :** ఆదిలాబాద్ జిల్లాలో కొంత మంది ఉపాధ్యాయులు సమయపాలన పాటించడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికే విద్యాశాఖలో ఉపాధ్యాయుల తీరుపై పలురకాల విమర్శలు,ఆరోపణలు వచ్చిన వారి తీరు మాత్రం మారడం లేదని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే పలువురు టీచర్లు సమయపాలన పాటించడం లేదని ప్రభుత్వం బయోమెట్రిక్ పెట్టినా.. అది పూర్తిస్థాయిలో అమలు కాకపోవడంతో ఫేషియల్ అటెండెన్స్‌ను అమలు చేస్తుంది. కానీ చాలా మంది ఉపాధ్యాయులు ఈ విధానంలో కూడా సమయపాలన పాటించకపోవడం, మరి కొంతమంది హాజరువేసుకొని వెళ్లడం, ఇంకొందరు బయట నుంచే అటెండెన్స్ నమోదు చేసుకొని వారి వారి వ్యాపారాల్లో బిజీగా ఉంటున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. కాగా ఈ ప్రక్రియపై అటెండెన్స్ ఎలా ఉందనే నివేదికను పాఠశాల విద్యశాఖ త్వరలో బయట పెట్టేందుకు సిద్ధమైంది. ప్రభుత్వం పకడ్బందీగా అమలు చేసేందుకు ఈ విధానం తీసుకొచ్చినప్పటికీ ఇంకా పూర్తిస్థాయిలో ఆశించిన ప్రయోజనం కనిపించడం లేదని తెలుస్తోంది. వీరి తీరుతో విద్యార్థులకు నష్టం వాటిల్లుతుందని అభిప్రాయం వ్యక్తమవుతోంది. కాగా ఉపాధ్యాయుల తీరుతో విద్యార్థులకు నష్టం జరగకుండా.. రానున్న రోజుల్లో ఫేషియల్ అటెండెన్స్ మరింత పగడ్బందీగా అమలు చేసేలా విద్యాశాఖ చర్యలు చేపట్టనున్నట్లు తెలుస్తోంది.

**మారని ఉపాధ్యాయుల తీరు..**

ఆదిలాబాద్ జిల్లాలో 500 ప్రాథమిక పా-ఠశాలలు,119 ప్రాథమికోన్నత పాఠశాలలు,120 ఉన్నత పాఠశాలలున్నాయి.ఇందులో 2567 మంది ఉపాధ్యాయులు విదులు నిర్వహిస్తున్నారు. కాగా వివిధ ప్రాథమిక పాఠశాలల పరిస్థితి అధ్వానంగా మారింది. టీచర్లు దుమ్మా కొట్టకుండా విద్యాశాఖ ఫేషియల్ అటెండెన్స్‌ను గత జూలై నుంచి అమలు చేసి ఉదయం, సాయంత్రం ఉపాధ్యాయులు అటెండెన్స్ నమోదు చేసేలా ఏర్పాట్లు చేసింది.దీంతో కొంతమంది మాత్రం ఈ అటెండెన్స్ తో ప్రతి రోజు విధులకు వస్తున్నా.. మరి కొంతమంది ఉపాధ్యాయులు మాత్రం మేమింతే మారం అన్నట్లుగా వ్యవహరిస్తున్నట్లు విమర్శలున్నాయి.

**పట్టించుకోని సంబంధిత అధికారులు**

జిల్లాలో కొంతమంది ఉపాధ్యాయులు విద్యార్థులకు పాఠాలు బోధించడం కంటే వారి సొంత పనుల్లోనే బిజీగా ఉంటున్నట్లు విమర్శలున్నాయి. సంబంధిత అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతోనే ఇష్టారితిన ఉపాధ్యాయులు పాఠశాలకు రావడం, అటెండెన్స్ వేసి మధ్యాహ్న సమయం తర్వాత పాఠశాలల్లో ఉండకుండా కొంతమంది ఉపాధ్యాయులు తమ వ్యాపారాలు, చిట్టీలు, రియల్ ఎస్టేట్ దందాల్లో మునిగి తేలుతున్నట్లు ఆరోపణలన్నాయి. దీనిపై సంబంధిత అధికారులు అంతమాత్రంగానే వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. కాగా రానున్న రోజుల్లో ఫేషియల్ అటెండెన్స్‌ను మరింత పకడ్బందీగా అమలు చేసేలా విద్యాశాఖ చర్యలు చేపట్టనున్నట్లు సమాచారం.

# లొంగిపోలేదు.. అరెస్ట్ చేశారు

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** మావోయిస్టులపై కేంద్ర ప్రభుత్వం చేపట్టిన 'ఆపరేషన్ కగార్' ఎంతవరకు పనిచేసింది? పార్టీ నిర్వీర్యం కావడానికి అసలు కారణాలేంటి? అనే ప్రశ్నలు అందరినీ తొలిచేస్తున్నాయి. ఈ క్రమంలోనే మావోయిస్టు అగ్ర నేతలు, పార్టీ సభ్యులు లొంగిపోవడానికి గల కారణాలపై ఆ పార్టీ మాజీ అగ్రనేత తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్ జీ సంచలన వ్యాఖ్యలు చేశారు.

**కీలక సమయాల్లో తప్పుడు నిర్ణయాలు..**

ఇవాళ ఆయన ఓ ప్రముఖ మీడియా ఛానల్ ప్రతినిధితో మాట్లాడుతూ.. తాము పోలీసుల ఎదుట లొంగిపోలేదని స్పష్టం చేశారు. తాము మొదటి నుంచీ జనజీవన స్రవంతిలోనే ఉన్నామని, పార్టీ అత్యంత కీలక సమయాల్లో తప్పుడు నిర్ణయాలు తీసుకోవడం వల్లే ఈ పరిస్థితి వచ్చిందని వ్యాఖ్యానించారు. మరోవైపు మావోయిస్టు పార్టీని విస్తరించడంలో తాము విఫలమయ్యామని ఆయన అంగీకరించారు.

**పిచ్చుకపై బ్రహ్మాస్త్రం లాగా 'ఆపరేషన్ కగార్'..**

'ఆపరేషన్ కగార్' తమకు చాలా చిన్న విష-యమని దేవ్ జీ పేర్కొన్నారు. పార్టీలో లక్షలాది మంది ప్రజలతో కలిసి పట్టణాల్లో, మైదానాల్లో, అడవుల్లో దోపిడీ వర్గాలకు వ్యతిరేకంగా పోరాటాలు కొనసాగించినట్లయితే.. అంతటి ప్రజా పునాది కలిగిన మావోయిస్టు పార్టీని ఏ 'ఆపరేషన్ కగార్' కూడా ఏమీ చేయలేదని ఆయన స్పష్టం చేశారు. రాజకీయంగా సకాలంలో సరైన నిర్ణయం తీసుకోకపోవడమే పార్టీకి నష్టం కలిగించిందని, ఆ లోపాన్ని సరిదిద్దుకునే అవకాశం లేకుండా కేంద్ర బలగాలు తమపై ఎడతెరిపి లేకుండా దాడులు చేశాయని తెలిపారు. మావోయిస్టు పార్టీ తన వైఫల్యాలను సమీక్షించుకునే లోపే ప్రభుత్వం 'పిచ్చుకపై బ్రహ్మాస్త్రం' లాగా ఈ ఆపరేషన్ చేపట్టిందని ఆయన అన్నారు.

**రాజకీయ నినాదం లేకపోవడమే దెబ్బ..**

ఒక్కో పార్టీ కార్యకర్త లేదా గెరిల్లా వెనుక 100 నుండి 200 మంది బలగాలను మోహరించి, మూడు-నాలుగు అంచెలుగా సైనిక దాడి జరిపారని వివరించారు. ఒక చిన్న గెరిల్లా దళాన్ని నిర్మూలించడానికి దేశవ్యాప్తంగా 8.5 లక్షలకు పైగా పోలీసు, పారా మిలటరీ, వివిధ రకాల కమాండో దళాలతో పాటు భారత



సైన్యం, వాయుసేనను కూడా రంగంలోకి దించి కేంద్రం యుద్ధం చేసిందని పేర్కొన్నారు. తమ లొంగుబాటుకు ఇవన్నీ సెంకడరీ కారణాలైతే.. రాజకీయంగా ఒక బలమైన నినాదాన్ని తీసుకుని ప్రజల ముందుకు వెళ్లకపోవడమే ప్రధాన పొరపాటని ఆయన విశ్లేషించారు. గెరిల్లా ఎత్తుగడలు అజేయమైనవని, కానీ వాటిని సరైన విధంగా ఆచరించకపోవడం వల్లే పార్టీ నిర్వీర్యమైందని దేవ్ జీ వెల్లడించారు.




# డాక్టర్ వేషధారణలో చోరీ..

**సికింద్రాబాద్,ఫ్లాష్ ఇండియా :**

సికింద్రాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో విచిత్రమైన చోరీ ఘటన చోటుచేసుకుంది. డాక్టర్ వేషధారణలో ఓ ఆగంతకురాలు రోగి వద్ద ఉన్న విలువైన బంగారు ఆభరణాలను కాజేసి పారిపోయింది. ఈ సంఘటన ఆస్పత్రి సిబ్బందిని షాక్‌కు గురిచేసింది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

**డాక్టర్ వేషధారణలో వచ్చి..**

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అనారోగ్య సమస్యలతో ఇటీవల ఓ ఆస్పత్రిలో బోయిన్‌పల్లికి చెందిన ఓ రోగి చేరారు. ఆస-్పత్రిలో చేరిన వెంటనే గైనకాలజీ డాక్టర్ కోసం రోగి వేచి ఉంది. ఆ సమయంలో ఓ గుర్తుతెలియని మహిళ బాధితురాలి నగలను దోచేసింది. వైద్య పరీక్షల కోసం వేచి ఉన్న సమయంలో, డాక్టర్ వేషధారణలో వచ్చిన ఆగంతుకురాలు, బాధితురాలి వద్ద ఉన్న నర్సులను బయటకు పంపించి, ఆమెకు మత్తుమందు ఇచ్చింది. ఆ సమయంలో ఆగంతకురాలు బాధితురాలి దగ్గర ఉన్న పది తులాల బంగారు ఆభరణాలను తీసుకుని పారిపోయింది. ఆస్పత్రి సిబ్బందికి కూడా ఈ సంఘటన షాక్‌కు గురిచేసింది. సాధారణంగా ఆస్పత్రిలో రోగి భద్రతపై ఎక్కువ శ్రద్ధ ఉంటుందని అనుకుంటారు, కానీ డాక్టర్ వేషధారణలో వచ్చిన ఆగంతకురాలు ఇలా రోగిని మత్తుమందు ఇచ్చి ఆభరణాలు తస్కరించడం ఆశ్చర్యంగా ఉందని సిబ్బంది తెలిపారు.

**పోలీసుల చర్యలు..**

బాధితురాలి నగల చోరీపై ఆమె కొడుకు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మే-రకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఆగంతకురాలిని గుర్తించేందుకు పోలీసులు రంగంలోకి దిగారు. ఈ క్రమంలో సీసీటీవీ ఫుటేజ్‌ని పరిశీలించారు. ఆస్పత్రి సిబ్బందిని పోలీసులు వివరాలు అడిగి తెలుసుకున్నారు.

# హామీ ఇస్తున్నా.. తప్పక నెరవేరుస్తా

**ఖమ్మం,ఫ్లాష్ ఇండియా :** 'నేనేం మీ కోసం చేయగలనో చెప్పు సోమన్న.. నీకు మాట ఇస్తున్నా.. తప్పక నెరవేరుస్తా..." అని మంత్రి పొంగులేటి సోమన్నకు హామీ ఇచ్చారు. ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తెలంగాణ ఉద్యమకారుడు బత్తుల సోమయ్యతో పాటు అతని సతీమణి తీవ్రంగా గాయపడ్డారు. కొద్ది రోజుల క్రితమే ఆస్పత్రి నుంచి ఇంటికి వచ్చారు. ఈ విషయం తెలుసుకున్న తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి గురువారం సాయంత్రం ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని వరంగల్ క్రాస్ రోడ్డు పరిధిలోని ఆటోనగర్ లో ఉన్న సోమయ్య ఇంటికి వెళ్లి పరామర్శించారు. ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బత్తుల సోమయ్య ఉద్యమకారులకు సంబంధించిన పలు అంశాలను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ఉద్యమంలో ఎన్నో త్యాగాలు చేసిన వారి కుటుంబాలు నేడు దుర్భరమైన జీవితాన్ని గడుపుతున్నాయని, అమరవీరుల తల్లిదండ్రులకు పట్టెడన్నం పెట్టే వాళ్లు కరువ-య్యారని సోమయ్య ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో ఉద్యమకారులకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయాలని మంత్రిని సోమయ్య కోరారు. తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీల్లో ప్రధానమైనది కార్పోరేషన్ ఏర్పాటు అని.., వెంటనే అమలు చేసేలా చూడాలని అన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసే సబ్ కమిటీలో ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి అర్హత ఉన్న ఉద్యమకారులకు అవకాశం కల్పించాలని కోరారు.

**సీఎంతో మాట్లాడి పరిష్కరిస్తాం:**

'సోమన్న మీరు సూచించిన ప్రతీ అంశం న్యాయమైనదే.. మీరు మీకోసం ఏదీ అడగడంలేదు.. ఉద్యమకారుల కోసమే అడుగుతున్నారు.. వాటిని పరిష్కరించేందుకు సీఎంతో మాట్లాడుతానని హామీ ఇచ్చారు. అదే విధంగా ఆస్పత్రికి అయిన ఖర్చులు సీఎంఆర్ఎఫ్ (సీఎం రిలీఫ్ ఫండ్) ద్వారా అందించేందుకు కృషి చేస్తానని అన్నారు. ఆరోగ్యం జాగ్రత్త.. మీరు త్వరగా కోలుకోవాలని సూచించారు.

మంత్రి వెంట మంత్రి క్యాంపు కార్యాలయ ఇంచార్జ్ దయాకర్ రెడ్డి, రామ సహాయం నరేష్ రెడ్డి ఉన్నారు. ఈ కార్యక్రమంలో పాలకుర్తి క్రిష్ణ, కుక్క సత్యం, తునికిపాటి చారీ, వడ్డియా రాజేష్ నాయక్, రామాంజనేయులు, బొలికొండ పాపయ్య, జంపాని అంజయ్య, వడ్డెబోయిన వెంకటేశ్వర్లు, ఉల్లంగి పద్మ, కొక్కెర శ్రీనివాస్, కొట్టం రంజితా రెడ్డి, కొట్టం శిరీష, భూక్యా సురేష్ నాయక్, అప్పలనేని రామారావు, పసునూరి అనిల్, మోహన్ రావు, అశోక్ సింగ్, వెంపటి వెంకన్న, అంబాల రామారావు, వీరభద్రం తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు



**తిరుమలాయపాలెం,ఫ్లాష్ ఇండియా :** రాష్ట్రంలో ప్రతి ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తూ, సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని రాష్ట్ర రెవెన్యూ, సమాచార పౌరసంబంధాల, గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన తిరుమలాయ-పాలెం మండలం దమ్మాయిగూడెంలో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టితో కలిసి ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడి 2 సంవత్సరాల మూడు నెలలు గడిచిందని, రేవంత్ రెడ్డి నాయకత్వంలో పేదల కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తూ, అభివృద్ధి పనులను కొనసాగిస్తున్నామని తెలిపారు. గ్రామాలు, పట్టణాలల్లో రోడ్లు, డ్రైయిన్లు ఇతర ఇతర మౌళిక వసతుల కల్పన పనులు ప్రాధాన్యతతో చేపట్టామని, క్షేత్ర స్థాయిలో ఉన్న సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం 99 రోజుల కార్యక్రమం చేపట్టిందన్నారు.దమ్మాయిగూడెం గ్రామంలో ఉన్న విద్యుత్ సమస్య రేపటి వరకు పరిష్కారం అవుతుందని హామీ ఇచ్చారు. ఎన్నికల సమ-యంలో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీ నెర వేరుస్తామన్నారు. ప్రభుత్వం ఇప్పటికే నూతన రేషన్ కార్డులు జారీ, 4.5 లక్షల ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ ద్వారా సన్న బియ్యం సరఫరా వంటి అనేక హామీలను అమలు చేశామని గుర్తు చేశారు. ఏప్రిల్ నెలలో మరో విడత ఇందిరమ్మ ఇండ్లు ప్రజలకు మంజూరు చేస్తామని, రాబోయే మూడు సంవత్సరాలలో అర్హులందరికీ ఇందిరమ్మ ఇల్లు అందించే బాధ్యత ప్రజా ప్రభుత్వం తీసుకుందని మంత్రి చెప్పారు. 99 రోజుల కార్యక్రమంలో భాగంగా దమ్మాయిగూడెం గ్రామాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రకటించారు.కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ ప్రజా పాలన -ప్రగతి ప్రణాళికలో భాగంగా 99 రోజుల పాటు చేపట్టాల్సిన వివిధ కార్యక్రమాలపై ప్రజాప్రతినిధులకు శిక్షణ అందించామన్నారు. ఈ కార్యక్రమంలో మొదటి ప్రాధాన్యతగా గ్రామాల్లో పారిశుధ్యం, పెండింగ్ ఫైల్స్ క్లియ-రెన్స్‌పై దృష్టి సారించినట్లు తెలిపారు. గ్రామ పంచాయతీకి విడుదలైన నిధులు వినియోగిస్తూ 99 రోజుల కార్యక్రమంలో భాగంగా గ్రామాలలో ఉన్న సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కలెక్టర్ తెలిపారు. గ్రామ పారిశుధ్య కార్యక్రమంలో భాగంగా రోడ్లను క్లిన్ చేయడమే కాకుండా, అంగన్వాడీ కేంద్రాలు, ప్రభుత్వ కార్యాలయాల పరిసరాలను కూడా శుభ్రం చేయాలని ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో పంచాయతీ రాజ్ ఎస్ఈ వెంకట్ రెడ్డి, పాలేరు నియోజకవర్గ ప్రత్యేక అధికారి రమేష్, ఖమ్మం ఆర్డీఓ శ్రీనివాస్, పాలేరు ఆత్మకమిటీ చైర్మన్ చావా శివరామకృష్ణ, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు రామసహాయం, నరేశ్ రెడ్డి, మాజీ ఎంపీపీలు మంగీలాల్, అశోక్, తహసీల్దార్ విల్సన్, ఎంపీడీఓ సిలారు సాహెబ్, సర్పంచ్, అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# హర్మూజ్‌లో 8 గ్యాస్ ట్యాంకర్లు!


**ఢిల్లీ :** అంతర్జాతీయంగా నెలకొన్న ఉద్రిక్తతల వల్ల హర్మూజ్ జలసంధి గుండా ఇంధన రవాణాకు ఆటంకాలు ఎదురవుతున్నాయి. జలసంధి వద్ద నిలిచిపోయిన ఎనిమిది గ్యాస్ ట్యాంకర్లను సురక్షితంగా భారత్‌కు రప్పించేలా ఇరాన్‌తో కేంద్ర ప్రభుత్వం చర్చలు జరుపుతోంది. ఈ మేరకు భారత విదేశీ వ్యవహారాల శాఖ ఇరాన్ అధికారులతో సంప్రదింపులు జరుపుతున్నట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి.

**జలసంధి వద్ద ఉత్కంఠ..**

ప్రస్తుతం ఎనిమిది గ్యాస్ ట్యాంకర్లు హర్మూజ్ జలసంధికి సమీపంలో నిలిచిపోయి, ముందుకు వెళ్లేందుకు 'గ్రీన్ సిగ్నల్' కోసం వేచి చూస్తున్నాయి. అయితే, అదృష్టవశాత్తూ ఇప్పటికే రెండు చమురు నౌకలు జలసంధిని దాటి భారత్ వైపు ప్రయాణాన్ని ప్రారంభించాయి. మిగిలిన ఎల్‌పీజీ నౌకలను కూడా త్వరితగతిన రప్పించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోంది.

**మొదలైన దౌత్య చర్చలు**

భారత విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి ఎస్. జైశంకర్, ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరగ్చీతో పలుమార్లు ఫోన్ ద్వారా చర్చలు



జరిపినట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. నౌకల సురక్షిత ప్రయాణానికి ఇరాన్ సానుకూలంగా స్పందించినట్లు సమాచారం. ఇదే సమయంలో, భారత్‌లో సుమారు 250 మంది ఇరాన్ నావికులు చిక్కుకుపోయి ఉన్నారు. వారిని స్వదేశానికి పంపేందుకు భారత ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తోంది. వారికి అవసరమైన వసతి, రక్షణను కూడా కల్పిస్తోంది. తమ నావికుల విషయంలో భారత్ చూపుతున్న చొరవ పట్ల ఇరాన్ సంతృప్తి వ్యక్తం చేస్తూ, గ్యాస్ ట్యాంకర్ల తరలింపునకు సహకరిస్తామని హామీ ఇచ్చినట్లు కేంద్ర ప్రభుత్వ వర్గాల సమాచారం అందుతోంది.



## బూడిదైన ఫర్నిచర్..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** నగరంలోని చందానగర్ ప్రాంతంలో ఉన్న ఒక ఫర్నిచర్ దుకాణంలో గురువారం అర్ధరాత్రి తర్వాత భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో దుకాణంలోని ఐదు అంతస్తుల్లో నిల్వ చేయబడిన ఫర్నిచర్ మొత్తం తగలబడింది. స్థానికులు ఇచ్చిన సమాచారంతో అగ్నిమాపక సిబ్బంది వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుంది. 7 ఫైర్ ఇంజన్లు, 11 వాటర్ ట్యాంకర్లతో మంటలను అదుపులోకి తెచ్చారు. దుకాణం ఐదు అంతస్తుల భవనంలో ఉండటం, లోపల సోఫాలు, బెడ్‌లు, టేబుల్స్ తదితరాలు ఉండడం వల్ల మంటలు వేగంగా వ్యాపించినట్లు తెలుస్తోంది. అగ్నిప్రమాదానికి కారణం ఏంటనేది తెలియాల్సి ఉంది. షార్ట్ సర్క్యూట్, గ్యాస్ లీకేజీ లేదా ఇతర కారణాలు ఉండవచ్చని భావిస్తున్నారు. పోలీసులు, అగ్నిమాపక అధికారులు సంయుక్తంగా ఘటన స్థలంలో దర్యాప్తు చేస్తున్నారు. ఈ ప్రమాదం కారణంగా చందానగర్ ప్రాంతంలో కొంత వరకూ సేవలకు అంతరాయం కలిగినట్లు తెలుస్తోంది. ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## బోల్తాపడిన ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు..

### నలుగురు ప్రయాణికులు దుర్మరణం



**నిజామాబాద్,ఫ్లాష్ ఇండియా :** ప్రైవేటు ట్రావెల్స్ బస్సు బోల్తాపడి నలుగురు ప్రయాణికులు దుర్మరణం పాలైన విషాద ఘటన నిజామాబాద్ జిల్లాలో ఇవాళ తెల్లవారుజామున చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. హైదరాబాద్ నుంచి బస్సు 22 మందితో అకోలా వెళ్తున్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ఇందల్వాయి మండల పరిధిలోని గన్నారం సమీపంలోకి చేరుకుంది. ఈ క్రమంలోనే డ్రైవర్ నియంత్రణ కోల్పోవడంతో బస్సు ఒక్కసారిగా బోల్తా పడింది. ప్రమాద సమయంలో బస్సులో ఉన్న ప్రయాణికులు గాఢ నిద్రలో ఉండటంతో అసలు ఏం జరిగిందో తెలియక హాహాకారాలు చేశారు. ఈ దుర్ఘటనలో మొత్తం నలుగురు ప్రాణాలు కోల్పోయారు. ప్రమాద సమాచారం అందుకున్న వెంటనే ఇందల్వాయి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం హుటాహుటిన సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. మృతుల వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. అతివేగమే ప్రమాదానికి కారణమని పోలీసులు భావిస్తున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తును ప్రారంభించారు.

## టెన్త్ క్లాస్ ఎగ్జామ్స్..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా 10వ తరగతి (SSC) పరీక్షలకు హాజరుకాబోతున్న లక్షలాది మంది విద్యార్థులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. భవిష్యత్తుకు తొలిమెట్టుగా ఈ పరీక్షలను ప్రతి విద్యార్థి ధైర్యంతో, ఆత్మవిశ్వాసంతో ఎదుర్కోవాలని కోరారు. భయం, ఆందోళన, ఒత్తిడి లేకుండా ప్రశాంతమైన మనసుతో పరీక్షలు రాస్తే తప్పకుండా మంచి ఫలితాలు సాధించవచ్చని, మీలోని ప్రతిభను నమ్ముకుని ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని విద్యార్థినీ విద్యార్థులకు పిలుపునిచ్చారు. పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తయిన నేపథ్యంలో ప్రశాంతమైన వాతావరణంలో పరీక్షలు రాసి ఉజ్వలమైన భవిష్యత్తుకు ముందడుగు వేయాలని ఆకాంక్షించారు. ఆదిలా ఉంటే.. పదో తరగతి పరీక్షల కోసం ఏర్పాట్లు పూర్తయ్యాయి. రేపు టెన్త్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈ సమయంలో స్కూల్ ఎడ్యుకేషన్ విభాగంగా అధికారులు కీలక నిర్ణయాలు అమలు చేస్తున్నారు. అందులో భాగంగా విద్యార్థులకు సూచనలు చేశారు. పరీక్షా కేంద్రాలకు కనీసం అరగంట ముందుగానే చేరుకోవాలని పేర్కొన్నారు. అదే విధంగా నమూనా OMR షీట్లు, జవాబు పత్రాల ఫార్మాట్‌ను బోర్డు అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు.

## కట్టెలకు అమాంతం పెరిగిన డిమాండ్..



**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** ఇజ్రాయెల్, అమెరికా మరియు ఇరాన్ యుద్ధంతో మధ్యప్రాచ్యంలో ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతూనే ఉన్నాయి.. దీంతో క్రూడాయిల్ ఎగుమతులు, దిగుమతులపై భారీ ప్రభావం పడింది.. పెట్రో, గ్యాస్ కు కొరత ఏర్పడుతుంది.. అయితే, ముఖ్యంగా భారత్‌లో కమర్షియల్ గ్యాస్‌కు తీవ్ర కొరత ఏర్పడింది.. వంట గ్యాస్ పంపిణీకి ప్రాధాన్యం ఇస్తున్న ప్రభుత్వం.. హోటళ్లకు మాత్రం సరఫరా తగ్గించింది.. అయితే, హైదరాబాద్‌లో కమర్షియల్ గ్యాస్ కొరత తీవ్ర ప్రభావం చూపుతోంది. గ్యాస్ సరఫరా నిలిచిపోవడంతో నగరంలోని అనేక హోటళ్లు, హాస్టళ్ల కిచెన్లు మూతపడే పరిస్థితి ఏర్పడింది. గ్యాస్ అందుబాటులో లేకపోవడంతో హోటళ్లు, హాస్టళ్ల నిర్వాహకులు ఇప్పుడు కట్టెల పొయ్యిలపై ఆధారపడుతున్నారు. దీంతో నగరంలో కట్టెలకు ఒక్కసారిగా భారీ డిమాండ్ పెరిగింది.

**భారీగా పెరిగిన కట్టెల అమ్మకాలు**

కట్టెల మండి నిర్వాహకుల ప్రకారం, మొన్నటి వరకు రోజుకు సుమారు 5 నుంచి 10 క్వింటాళ్ల (500 కిలో నుంచి వెయ్యి కిలోలు) వరకు మాత్రమే కట్టెలు అమ్ముడయ్యేవి. అయితే, గత రెండు మూడు రోజులుగా డిమాండ్ అమాంతం పెరిగి రోజుకు సుమారు ఐదు టన్నుల వరకు (5 వేల కిలోలు) కట్టెలు అమ్ముడవుతున్నాయని కట్టెల మండి నిర్వాహకులు చెబుతున్నారు.. ఈ డిమాండ్ ఇలాగే కొనసాగితే మరో మూడు నాలుగు రోజుల్లో కట్టెల నిల్వలు కూడా పూర్తిగా అయిపోయే అవకాశముందని నిర్వాహకులు చెబుతున్నారు. ఇక, గ్యాస్ సరఫరా నిలిచిపోవడంతో గత నాలుగు రోజులుగా కట్టెల పొయ్యిలపైనే వంట చేస్తున్నామని హోటల్ నిర్వాహకులు చెబుతున్నారు. అయితే కట్టెలతో వంట చేయడం వల్ల అన్ని రకాల వంటకాలు తయారు చేయడం కష్టంగా మారిందని, దీంతో వ్యాపారం కూడా తగ్గిపోయిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## మిర్యాలగూడలో ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల దాడులు



**మిర్యాలగూడ,ఫ్లాష్ ఇండియా :** మిర్యాలగూడ పట్టణంలో సివిల్ సప్లై ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు విస్తృత దాడులు నిర్వహించారు. పట్టణంలోని మంజీరా బార్ అండ్ రెస్టారెంట్, హోటల్స్, కర్రీ పాయింట్‌ల పై దాడులు నిర్వహించారు. ఈ దాడులలో సుమారు 36 గ్యాస్ సిలిండర్లు స్వాధీనం చేసుకున్నారు. అక్రమంగా సిలిండర్లు వినియోగిస్తున్న నిర్వాహకులపై 6ఏ కేసులు నమోదు చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. గృహ వినియోగానికి ఉపయోగించే సిలిండర్లను అక్రమంగా వాడుతున్నారని పట్టుకున్నట్లు అధికారులు తెలిపారు.

## ఆచార్య ఐ. ఐ. టి. అకాడమీ తోనే ఎంసెట్ సాధ్యం



**మిర్యాలగూడ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి:** ఎంతో కష్టపడి చదివి ఇంటర్మీడియట్ పరీక్షలను పూర్తిచేసుకొన్న విద్యార్థిని విద్యార్థులు ఎంసెట్,నీట్ పరీక్షలకు సిద్ధం కావాలని ఆచార్య ఐ.ఐ.టి అకాడమీ ని నిర్వహిస్తున్న మాథ్స్ వినోబారెడ్డి అన్నారు. మేనేజ్మెంట్ సీట్ల కోసం లక్షల రూపాయలు చెల్లించి తల్లిదండ్రులు ఇబ్బంది పడవద్దని ఇప్పటివరకు ఎంతోమంది విద్యార్థులను జీరో టు హీరోలను చేసిన నెంబర్ వన్ ఆచార్య ఐఐటి అకాడమీలో ఈ మార్చి 16 నుండి క్లాసులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సదవకాశాన్ని ఇంటర్మీడియట్ అయిపోయిన విద్యార్థులు సద్వినియోగం చేసుకొని మీ పిల్లల ఉజ్వల భవిష్యత్తుకు శ్రీకారం చుట్టాలని కోరారు. 9848 41 8201 కు కాల్ చేసి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

## వ్యక్తి అనుమానస్పద మృతి...

**మిర్యాలగూడ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి:**

మిర్యాలగూడ మండల పరిధి లోని తడకమళ్ళ గ్రామానికి చెందిన అనంతుల లింగయ్య తండ్రి వెంకయ్య అను అతను వారి గ్రామ శివారులోని పాలేరు వాగు గుండ దాటుకుంటూ తన పొలానికి వెళ్లేవాడు.

రోజు మాదిరిగా తేదీ 12.03.2026 రోజు మధ్యాహ్నం 12 గంటల సమయంలో లింగయ్య తన పొలానికి వెళ్తున్నానని చెప్పి ఇంటి నుండి బయలుదేరినాడు కానీ తర్వాత ఎంతకు ఇంటికి రాకపోయేసరికి వాగు వెంబడి వెతుకగా తేదీ 13.03.2026 రోజు ఉదయం 5 గంటల సమయంలో మృతదేహం పాలేరు వాగులో దొరికినది.

ఈ విషయమై మృతుని కుమారుడైన అనంతుల సతీష్ ఇచ్చిన దరఖాస్తుపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించనైనది అని మిర్యాలగూడ రూరల్ ఎస్సై లక్ష్మయ్య తెలిపారు.



## అన్ని దానాల కన్నా అన్నదానం గొప్పది..





**మిర్యాలగూడ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి:**

అన్ని దానాల కన్నా అన్నదానం గొప్పదని లైన్స్ క్లబ్ ఆఫ్ శక్తి న్యూ వాయిస్ జోన్ పర్సన్ డాక్టర్ ఝాన్సీ రాణి అన్నారు. శుక్రవారం హైదరాబాద్ కు చెందిన సంతోషమ్మ 100వ జయంతి సందర్భంగా మదర్ తెరిసా హోమ్ లో వృద్ధులకు అన్నదాన కార్యక్రమం లో పాల్గొని ఆమె మాట్లాడుతూ మానసిక వికలాంగులు, వృద్ధులకు మదర్ థెరిస్సా సంస్థ చేస్తున్న సేవలు ఎంతో గొప్పవని అన్నారు. తమ క్లబ్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నామని,ఇంకా గ్రామీణ ప్రాంతాలలోసేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని అన్నారు.

సంతోషమ్మ కుమార్తె ఇందిరా వినాయకరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి లయన్స్ క్లూ ఆఫ్ మానస గ్లోబల్ క్లబ్ ప్రెసిడెంట్, మాజీ టీఎన్జీవో అధ్యక్షుడు శ్రవణ్ కుమార్, మంగ్తా నాయక్,లయన్స్ క్లబ్ ఆఫ్ శక్తి న్యూ వాయిస్ సభ్యులు మాధవి,సుజాత,పద్మ క్రాంతి,సిస్టర్లు తదితరులు పాల్గొన్నారు.

## డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ యువ జన సంఘం మిర్యాలగూడ డివిజన్,పట్టణ కమిటీలు రద్దు..




**మిర్యాలగూడ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి:** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అంబేద్కర్ యువజన సంఘం (రిజిస్ట్రేషన్ నెం. 1033/77) రాష్ట్ర కమిటీ వ్యవస్థాపకులు రిటైర్డ్ డాక్టర్ జె.బి. రాజు చీఫ్ అడ్వైజర్ తెలంగాణ రాష్ట్ర అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు చిప్పలపల్లి అవిలయ్య,రాష్ట్ర కార్యదర్శి బి. నాగరాజు తెలంగాణలో అంబేద్కర్ యువజన సంఘాలను గ్రామ స్థాయి నుండి మండల స్థాయి,పట్టణ స్థాయి, నియోజకవర్గ స్థాయి కమిటీలను కొత్తగా నిర్మాణం చేసి ఇట్టి సంఘాన్ని తెలంగాణవ్యాప్తంగా బలోపేతం చేయాలని రాష్ట్ర కమిటీ అధ్యక్షులు చిప్పలపల్లి అవిలయ్య అధ్యక్షతన రాష్ట్ర జనరల్ బాడీ సమావేశం హైదరాబాద్ లో తీర్మాణం చేయడం జరిగింది. అట్టి రాష్ట్ర జనరల్ బాడీ సమావేశం తీర్మాణం ప్రకారం రాష్ట్ర వ్యాప్తంగా సంఘాలను బలోపేతం చేసే క్రమంలో గ్రామ/మండల/పట్టణ/ నియోజకవర్గస్తాయి నూతన కమిటీలను పునర్నిర్మాణం చేసి ప్రకటించుటకు రాష్ట్ర కమిటీ వారు జిల్లాల వారీగా నల్లగొండ జిల్లా అధ్యక్షులైన కొండేటి వెంకట్ ని, జిల్లా వ్యాప్తంగా కమిటీలను కొత్తగా నిర్మాణం చేసి రాష్ట్ర కమిటీ వారికి నివేదిక సమర్పిం చవలసినదిగా కోరినారు.

కావున రాష్ట్ర జనరల్ బాడీ సమావేశ తీర్మాణం ప్రకారం వారి ఆదేశాలను నుండి మిర్యాలగూడ పట్టణ కమిటీ డివిజన్ కమిటీ కాలపరిమితి తేది 11.02.2024 నుండి తేది 11.02.2026 వరకు తీరినందున మరలా నూతన పట్టణ, నియోజకవర్గస్థాయి కమిటీలను నిర్మాణం చేయుటకు నల్లగొండ జిల్లా కమిటీ మన సంఘం రాష్ట్ర కమిటీ జాయింట్ సెక్రటరీ సమక్షంలో తీర్మాణం చేయడం జరిగింది. కావున ఉత్సాహ వంతులైన దళిత,గిరిజన, బహుజన ముస్లిం,మైనార్టీ సమాజికవర్గాల వారి పట్ల అవగాహన కలిగి డా॥ బి.ఆర్. అంబేద్కర్ సిద్ధాంతాల పట్ల సామాజిక ఉద్యమ నేపథ్యం కలిగిన యువకులను మన సంఘం రాష్ట్ర జాయింట్ కార్యదర్శి పెరుమాల్ల బాలస్వామి సమక్షంలో కొత్త కమిటీలను ఎన్నుకొనబడును.

## ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక అమలుపై సన్నాహక సమావేశం





**మిర్యాలగూడ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి:**

మిర్యాలగూడ పట్టణంలోని నందిపాడు టిఎన్ఆర్ గార్డెన్స్ నందు నిర్వహించిన మిర్యాలగూడ నియోజకవర్గ స్థాయి ప్రజా పాలన - ప్రగతి ప్రణాళికలి అమలుపై సన్నాహక సమావేశం లో జిల్లా కలెక్టర్ చంద్ర శేఖర్, శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి,ఎమ్మెల్సీ శంకర్ నాయక్,సబ్ కలెక్టర్ నారాయణ అమిత్,డీఎస్పీ రాజశేఖర్ రాజు,మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, డీసీసీ అధ్యక్షులు పున్న కైలాష్ నేత జిల్లా ఉన్నత అధికారులు, నియోజకవర్గ అన్ని విభాగాల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల యాక్షన్ ప్లాన్ లో భాగంగా నిర్వహించే పలు అభివృద్ధి కార్యక్రమాల గురించి వివరించారు. అనంతరం ఎమ్మెల్యే బిఎల్ఆర్ మాట్లాడుతూ ప్రియతమ నాయకులు సీఎం రేవంత్ రెడ్డి దూరదృష్టితో పల్లెలను పట్టణాలను మండలాలను అభివృద్ధి పరంగా ఉన్నతంగా ఉంచాలనే సంకల్పంతో

నూతనంగా శ్రీకారం చుట్టిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని విజయవంతం చేసుకోవాల్సిన బాధ్యత మన అందరిపై ఉన్నదని అన్నారు.

ముఖ్యంగా గ్రామాల్లో మండలాల్లో మున్సిపాలిటీల్లో నెలకొన్న సమస్యలను గుర్తించి.. వాటిని పరిష్కరించేందుకు ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుంది అన్నారు. అంతేగాక మూడు నెలల పాటు ప్రజా ప్రతినిధులను, అధికారులను ప్రజలకు దగ్గర చేసి అభివృద్ధి,సంక్షేమ పథకాలలో భాగస్వామ్యం చేసే ఈ కార్యక్రమం చాలా ఉన్నతమైంది అని అన్నారు. కొత్తగా ఎన్నికైన ప్రజాప్రతినిధులకు ప్రజా సేవ చేసే అవకాశం ఉన్న కార్యక్రమం ఇది. ప్రభుత్వం నిర్దేశించిన విధంగా 99 రోజులపాటు చేపట్టాల్సిన ప్రజాహిత కార్యక్రమాలను పకడ్బందీగా నిర్వహించేందుకు అందరం కట్టుబడి ఉండాలన్నారు,సమస్యలు ఎక్కడ ఉన్నా వాటిని గుర్తించి పరిష్కారానికి అయ్యే ఖర్చును అంచనావేసి ప్రభుత్వానికి నివేదికలు సమర్పించాల్సి ఉందన్నారు.

తద్వారా ప్రభుత్వ నిధులతో సమస్యలను సమూలంగా పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాల్సి ఉంది. ఎన్నుకున్న ప్రజలకు జవాబుదారీగా ప్రజాప్రతినిధులు ఉండాలనే ఉద్దేశంతో సీఎం రేవంత్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని అందరం కలిసి విజయవంతం చేద్దాం అన్నారు. రాజకీయాలు,పార్టీలు ఎన్నికల వరకే అభివృద్ధి సంక్షేమ పథకాల అమలు విషయంలో అందరూ సమానమే. మిర్యాలగూడ అభివృద్ధి విషయంలో ఏ పార్టీ వాళ్ళైనా.. ఎవరైనా సరే నేరుగా సంప్రదించవచ్చు. ఎవరు ఏమనుకున్నా ఎన్ని అనుకున్నా మిర్యాలగూడ అభివృద్ధి మనందరి లక్ష్యం కావాలన్నారు. ముఖ్యంగా వేసవికాలం వచ్చినందున ఎక్కడ కూడా తాగునీటి సమస్య ఏర్పడకుండా జాగ్రత్త చర్యలు తీసుకోవాల్సిన కర్తవ్యం మనందరిపై ఉన్నది. నీటి ఎద్దడి ఏర్పడిన ప్రాంతాలను ముందస్తుగానే గుర్తించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లను చేయాలి. విద్యుత్ సమస్యలు పరిష్కరించాలి. లో వోల్టేజ్ సమస్యలు లేకుండా చూడాలి. మున్సిపాలిటీ కార్మికులు డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచడంతో పాటు దోమల నివారణకు మెరుగైన పారిశుధ్యం కోసం ప్రత్యేకంగా కృషి చేయాలి. కనీస సౌకర్యాలైన రోడ్లు,విద్యుత్,పారిశుధ్యం,డ్రైనేజ్ వంటి అంశాలకు ముందుగా ప్రాధాన్యతనిచ్చి ఒక్కొక్కటిగా అభివృద్ధి చేసుకోవాలి. అంతేగాక కోతులు కుక్కల బెడద నుంచి ప్రజలను రక్షించేందుకు అవంతీపురం గ్రామం వద్ద ఏర్పాటు చేసిన ఏబీసీ సెంటర్ నిర్మాణ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలి అని తెలియజేసారు. మిర్యాలగూడ నియోజకవర్గంలో ప్రతి ఒక్కరికి విద్యా,వైద్యం అందించేందుకు అందరం సమిష్టిగా కృషి చేద్దాం."నేను..నా మిర్యాలగూడ "అనే నినాదం అందరి అభిమతం కావాలని ఆకాంక్షిస్తున్నాను. 99 రోజులపాటు జరిగే కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రజలందరూ సహకరించాలి అని అన్నారు. ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు ప్రభుత్వం సూచించిన విధంగా ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమాల్లో పాలుపంచుకోవాలి అని సూచించారు. మిర్యాలగూడ అభివృద్ధికి, ప్రాంత ప్రజల సంక్షేమానికి సహకరించాలి అని సూచించారు. ఈ కార్యక్రమంలో మిర్యాలగూడ నియోజకవర్గ సర్పంచ్ లు, కౌన్సిలర్స్, ఉప సర్పంచ్ లు, వార్డ్ మెంబర్స్, అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు..



# షికాగో బుల్స్ సూపర్ విక్టరీ

ఎన్‌బీఏ సీజన్‌లో భాగంగా జరిగిన హోరాహోరీ పోరులో షికాగో బుల్స్ జట్టు 142-130 స్కోర్ తేడాతో అద్భుత విజయాన్ని అందుకుంది. ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది అభిమానులు ఆసక్తిగా ఎదురుచూసిన ఈ మ్యాచ్‌లో లాస్ ఏంజిల్స్ లేకర్స్‌ను బుల్స్ మట్టికరిపించింది. మ్యాచ్ ఆరంభం నుంచే ఇరు జట్లు పాయింట్ల కోసం పోటాపోటీగా తలపడ్డాయి. ఆక స్టార్ ప్లేయర్లతో బరిలోకి దిగిన లేకర్స్ జట్టు, బుల్స్ వ్యూహాత్మక ఆట తీరు ముందు తలవంచక తప్పలేదు. ముఖ్యంగా డిఫెన్స్ విభాగంలో లేకర్స్ చేసిన పొరపాట్లు వారికి భారీ నష్టాన్ని చేకూర్చాయి.షికాగో బుల్స్ ఆటగాళ్లు అటాకింగ్ గేమ్‌తో ప్రత్యర్థి జట్టుపై తీవ్ర ఒత్తిడి పెంచారు. నిర్ణీత సమయం ముగిసేసరికి స్పష్టమైన ఆధిక్యంతో విజేతగా నిలిచారు. బుల్స్ జట్టులోని టాప్ స్కోరర్లు వరుస బాస్కెట్లతో స్కోరు బోర్డును పరుగులు పెట్టించారు. లేకర్స్ స్టార్ ఆటగాళ్లు ప్రయత్నించినప్పటికీ ఓటమిని అడ్డుకోలేకపోయారు.

# రోహిత్, కోహ్లీ కోసం స్పెషల్ ప్లాన్ రెడీ..



ఇటీవల టీమిండియా టీ20 వరల్డ్ కప్పును కైవసం చేసుకుంది. సూర్యకుమార్ నేతృత్వంలోని జట్టు అద్భుత ప్రదర్శనతో అభిమానులను ఆకట్టుకుంది. ఎలాంటి ఒత్తిడి లేకుండా ఫైనల్ లో న్యూజిలాండ్ ను చిత్తు చేసింది. ఇక ఇదే జోష్ లో టీమిండియా మరో కప్పుపై దృష్టి పెట్టింది. 2027లో జరిగే వన్డే వరల్డ్ కప్పును కైవసం చేసుకోవాలని ప్లాన్ చేస్తోంది. ఇందుకోసం బీసీసీఐ ఇప్పటి నుంచే మాస్టర్ ప్లాన్ సిద్ధం చేస్తోంది. మే నెలలో ఐపీఎల్ ముగిసిన వెంనే ఇక వన్డే ఫార్మట్ పై దృష్టి సారించుంది. ప్రస్తుతం వన్డేలో రోహత్, కోహ్లీ వంటి సీనియర్ ప్లేయర్స్ ఉన్నారు. కేవలం వన్డేలోనే కొనసాగుతున్న ఈ ఇద్దరి ప్లేయర్ కు తగినంత ప్రాక్టీస్ లభించేలా విదేశీ బోర్డులు చేస్తున్న ప్రతిపాదనలకు బీసీసీఐ పచ్చజెండా ఊపింది.ప్రస్తుతం షెడ్యూల్ ప్రకారం.. మేలో ఐపీఎల్ ముగుస్తుంది. ఇక జూన్ లో ఆఫ్ఘనిస్థాన్ తో ఒక టెస్ట్ ఉంటుంది. ఈ టెస్ట్ సిరీస్ భారత్ లో కొనసాగనుంది. ఈ టెస్ట్ తో పాటు మూడు వన్డేల సిరీస్ ఉంటుంది. ఇది ముగిసిన వెంటనే మళ్లీ ఇంగ్లాండ్ కు టీమిండియా జట్టు పయనం కావాల్సి ఉంటుంది. ఇంగ్లాండ్ తో ఐదు 20లతో పాటు మూడు వన్డేలు ఆడనుంది. ఇదే పర్యటనలో ఐర్లాండ్ తో సైతం చిన్న ఫార్మాట్ సిరీస్ ఆడే అవకావం ఉంది. ఇక్కడితో ముగియ లేదు.. శ్రీలంక, న్యూజిలాండ్, వెస్టిండీస్, బంగ్లాదేశ్ జట్లతోనూ టీమిండియా తలపడనుంది. రోహిత్, కోహ్లీల క్రేజ్ దృష్ట్యా తమ పర్యటనల్లో మరిన్ని వన్డేలను చేర్చాలని న్యూజిలాండ్ క్రికెట్ బోర్డు ఇప్పటికే కోరగా, బీసీసీఐ అందుకు మొగ్గు చూపుతోంది. ఇదిలా ఉండగా.. ఆర్సీబీ ఆశా జ్యోతి కోహ్లీ ఇప్పటికే ఐపీఎల్ కసరత్తు ప్రారంభించాడు. ప్రాక్టీస్ చేస్తున్న వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. వాటిని చూసిన ఫ్యాన్స్ ఫుల్ ఖుషీ అవుతున్నారు. రెండోసారి కప్పు కొట్టాలని ఆశా భావం వ్యక్తం చేస్తున్నారు. భారత దిగ్గజాలు సిద్ధమవుతున్నారు.

# ఐపీఎల్ 2026 మ్యాచ్‌ల షెడ్యూల్ విడుదల అప్పుడే..!




ఎన్నో రోజులుగా క్రికెట్ అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఐపీఎల్ 2026 సీజన్ షెడ్యూల్ కు సంబంధించి కొన్ని వివరాలు మాత్రమే వెలువడ్డాయి. బీసీసీఐ మార్చి 11న టోర్నమెంట్ మొదటి దశకు సంబంధించిన షెడ్యూల్ ను మాత్రమే ప్రకటించింది. ప్రస్తుతం ఈ షెడ్యూల్ మా-త్రమే విడుదల అయ్యి మిగతా మ్యాచ్‌ల తేదీలను ప్రకటించకపోవడంతో అభిమానుల్లో సందేహాలు ఏర్పడ్డాయి. అయితే దీనికి గల కారణాన్ని బీసీసీఐ ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్ల తాజాగా వెల్లడించారు.ఐపీఎల్ 2026 సీజన్ మార్చి 28న ప్రారంభమై మే 31 వరకు కొనసాగనుంది. తొలి మ్యాచ్ బెంగళూర-ులోని చిన్నస్వామి స్టేడియంలో జరగనుంది. 2025 ఐపీఎల్ విజేత రాయల్ చాలెంజర్స్ బెంగళూరు, సన్ రైజర్స్ హైదరాబాద్ మధ్య జరిగే మ్యాచ్ తో టోర్నమెంట్‌కు శ్రీకారం చుట్టనున్నారు. విడుదలైన షెడ్యూల్ ప్రకారం ఏప్రిల్ 12 వరకు మ్యాచ్ లు జరుగుతాయి. అప్పటివరకు ప్రతి జట్టు సుమారు మూడు లేదా నాలుగు మ్యాచ్‌లు ఆడే అవకాశం ఉంది.మిగతా మ్యాచ్‌ల షెడ్యూల్ విడుదలలో ఆలస్యం కావడానికి ప్రధాన కారణం ఆయా రాష్ట్రాలలో జరిగే అసెంబ్లీ ఎన్నికలు. ఈ ఏడాది తమిళనాడు, వెస్ట్ బెంగాల్, అస్సాం రాష్ట్రాల్లో ఎన్నికలు జరగనున్నాయి. ఈ రాష్ట్రాల్లో కూడా ఐపీఎల్ మ్యాచ్‌లు నిర్వహించాల్సి ఉండటంతో భద్రతా ఏర్పాట్లు, సమన్వయం దృష్ట్యా బీసీసీఐ ముందుగా పూర్తి షెడ్యూల్ ప్రకటించలేదు.ఈ విషయంపై రాజీవ్ శుక్లా మాట్లాడుతూ.. ఎన్నికల కమిషన్ ఎన్నికల తేదీలను ప్రకటించిన తర్వాత మిగిలిన మ్యాచ్ ల షెడ్యూల్‌ను వెంటనే విడుదల చేస్తామని తెలిపారు. టోర్నమెంట్ మాత్రం ముందే నిర్ణయించిన సమయానికి జరుగుతుందని ఆయన స్పష్టం చేశారు. ప్రారంభ షెడ్యూల్ లో మరో ముఖ్య అంశం ఏమిటంటే.. సీజన్ మొదటి మ్యాచ్ బెంగళూరులోని చినాస్వామి స్టేడియంలో జరగనుండటం.

ఇంకా రాజస్థాన్ రాయల్స్ జట్టు హోమ్ మ్యాచ్ లలో మూడు ఈసారి గౌహతిలో జరగనున్నాయి. సాధారణంగా జైపూర్ లో జరిగే ఈ మ్యాచ్ లు గత కొన్ని సీజన్లుగా గౌహతిలో కూడా నిర్వహిస్తున్నారు. అయితే ఈసారి జైపూర్‌లో జరిగే మ్యాచ్‌లపై అనిశ్చితి నెలకొంది.

# టీమిండియాలో పెను మార్పులు..





భారత వన్డే జట్టులో త్వరలోనే కీలక మార్పులు చోటు చేసుకునే అవకాశం ఉందని తెలుస్తోంది. సీనియర్ ఆటగాళ్లు కేఎల్ రాహుల్, రిషబ్ పంత్, రవీంద్ర జడేజాలు భవిష్యత్తులో భారత జట్టు వన్డే ప్రణాళికల్లో ఉండకపోవచ్చని సమాచారం. 2027 వరల్డ్ కప్‌ను దృష్టిలో ఉంచుకుని.. బీసీసీఐ సెలెక్టర్లు కొత్త వ్యూహాలతో ముందుకు వెళ్లాలని ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది. ఐపీఎల్ 2026 సీజన్ ముగిసిన తర్వాత వన్డే జట్టు ఎంపికపై కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉందట. 2027 వరల్డ్ కప్ కోసం అత్యున్నత భారత జట్టును సిద్ధం చేయాలనే ఉద్దేశంతో యువ ఆటగాళ్లకు ఎక్కువ అవకాశాలు ఇవ్వాలని టీమ్ మేనేజ్‌మెంట్ భావిస్తున్నట్లు తెలుస్తోంది. సీనియర్ ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా ఇప్పటికే తన చివరి వన్డే మ్యాచ్ ఆడేసి ఉండొచ్చని కూడా క్రికెట్ వర్గాలు అంటున్నాయి. జట్టు యా-జమాన్యం ఇప్పుడు యువ స్పిన్ బౌలింగ్ ఆల్‌రౌండర్లపై దృష్టి పెట్టాలని భావిస్తోందట. అక్షర్ పటేల్, శివమ్ దూబే, వాషింగ్టన్ సుందర్ లాంటి ప్లేయర్స్ ఇప్పటికే నిరూపించుకున్నారు. టీ20 వరల్డ్ కప్ 2026లో దూబే అద్భుతంగా ఆడిన విషయం తెలిసిందే.మరోవైపు 2027 వరల్డ్ కప్ దక్షిణాఫ్రికాలో జరగనుంది. అక్కడి పిచ్‌లపై వేగం, బౌన్స్ కీలకంగా ఉంటుంది. ఈ నేపథ్యంలో వికెట్‌కీపర్ బ్యాట్స్‌మెన్‌లుగా సంజు శాంసన్, ఇషాన్ కిషన్‌లకు ఎక్కువ అవకాశాలు ఇవ్వాలని సెలెక్టర్లు భావిస్తున్నారట. గాయాలు, ఫిట్‌నెస్, ఫామ్ లేని రిషబ్ పంత్ మెగా టోర్నీకి దాదాపుగా దూరమయినట్లే. యశస్వి జైస్వాల్, రోహిత్ శర్మ ఓపెనర్లుగా ఆడుతారు. దాంతో కేఎల్ రాహుల్ కూడా అనుమానమే. విరాట్ కోహ్లీ, శుభ్‌మన్ గిల్, టపార్డర్లో ఆడుతారు. శ్రేయాస్ అయ్యర్, హార్దిక్ పాండ్య, శివమ్ దూబే, సంజు శాంసన్, ఇషాన్ కిషన్‌లు మిడిల్ ఆర్డర్లో ఉన్నారు. మొత్తానికి టీమిండియా వన్డే జట్టులో పెను మార్పులు చోటు చేసుకునే అవకాశముందని క్రికెట్ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. యువ ఆటగాళ్లతో కొత్త జట్టును తయారు చేసి 2027 వరల్డ్ కప్‌కు సిద్ధం కావాలనే లక్ష్యంతో బీసీసీఐ ఈ నిర్ణయాలు తీసుకునే అవకాశముందని తెలుస్తోంది.

# 'సన్‌రైజర్స్' జట్టులోకి పాక్ స్పిన్నర్ అబ్రార్..



ఇంగ్లాండ్‌లో గురువారం జరిగిన 'ది హండ్రెడ్' లీగ్ వేలంలో పాక్ స్పిన్నర్ అబ్రార్ అహ్మద్‌ను ఐపీఎల్ ఫ్రాంచైజీ సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు చెందిన సన్‌రైజర్స్ లీడ్స్ కొనుగోలు చేయడం చర్చనీయాంశంగా మారింది. అబ్రార్ అహ్మద్‌ను సన్‌రైజర్స్ లీడ్స్ రూ.2.34 కోట్లకు జట్టులోకి తీసుకుంది. మరో ఫ్రాంచైజీ ట్రెంట్ రాకెట్స్‌తో పోటీపడి మరి అతన్ని దక్కించుకుంది. వేలంలో కావ్యా మారన్ కూడా పాల్గొంది. 2009లో ఐపీఎల్ నుంచి పాక్ క్రికెటర్లను నిషేధం విధించినప్పటి నుంచి ఓ పాక్ క్రికెటర్‌తో భారత్‌కు చెందిన ఫ్రాంచైజీ ఒప్పందం చేసుకోవడం ఇదే తొలిసారి. అబ్రార్‌ను 'సన్‌రైజర్స్' కొనుగోలు చేయడంపై భారత అభిమానులు మండిపడుతున్నారు. ఆపరేషన్ సింధూర్ తర్వాత అబ్రార్ భారత్‌ను అవమానించాలే పోస్టు చేసిన విషయాన్ని గుర్తు చేస్తూ.. కావ్య మారన్‌పై విమర్శలు గుప్పిస్తున్నారు. వేలంలో 13 మంది పాక్ ప్లేయర్లు పాల్గొన్నారు. మరో స్పిన్నర్ ఉస్మాన్ తారిఖ్‌ను బర్మింగ్‌హామ్ సొంతం చేసుకుంది. హారిస్ రవూఫ్, షాదాబ్ ఖాన్, సైమ్ అయూబ్‌లపై ఏ ఫ్రాంచైజీ ఆసక్తి చూపించలేదు.

## బిజినెస్







# ప్రైవసీ కోసం కొత్త సేవ..

డిజిటల్ ఇండియా యుగంలో మహిళల భద్రత, ప్రైవసీకి ప్రాధాన్యత ఇస్తూ ప్రభుత్వ టెలికాం సంస్థ భారత్ సంచార నిగమ్ లిమిటెడ్ (బిఎస్ఎన్ఎల్) కొత్త సేవను ప్రారంభించింది. "కవచ్ నంబర్" పేరుతో వచ్చిన ఈ సేవ మహిళల వ్యక్తిగత మొబైల్ నంబర్‌ను రహస్యంగా ఉంచేందుకు సహా-యపడుతుంది. ఈ సేవ ద్వారా మహిళలకు ఒక 10 అంకెల ప్రత్యామ్నాయ (టెంపరరీ) నంబర్ అందుతుంది.సాధారణంగా ఫిజికల్ స్టోర్లలో రీచార్జ్ చేసేటప్పుడు వ్యక్తిగత మొబైల్ నంబర్ ఇవ్వాల్సి వస్తుంది. కానీ ఇప్పుడు "కవచ్ నంబర్" ద్వారా అసలు నంబర్ వెల్లడించకుండా రీచార్జ్ చేయించుకోవచ్చు. అసలు ఈ బిఎస్ఎన్ఎల్ కవచ్ నంబర్ అంటే ఏంటంటే.. ఈ సేవను యాక్టివేట్ చేసిన తర్వాత మహిళలకు వారి ప్రాథమిక మొబైల్ నంబర్ కు అనుసంధానమైన మరో 10 అంకెల టెంపరరీ నంబర్ ఇవ్వబడుతుంది. దీనితో మీకు తెలియని స్టోర్‌లో రీచార్జ్ చేయాల్సి వచ్చినప్పుడు లేదా మీ మొబైల్ నంబర్ ఇవ్వడానికి ఇష్టంలేని పరిస్థితుల్లో.. అసలు నంబర్ కు బదులుగా ఈ కవచ్ నంబర్ ను ఇవ్వవచ్చు.ఆ స్టోర్ ఆ టెంపరరీ నంబర్ తో రీచార్జ్ చేస్తే, టాక్‌టైమ్ లేదా డేటా నేరుగా మీ అసలు మొబైల్ నంబర్ కే చేరుతుంది. అయితే భద్రత కారణాల వల్ల ఈ టెంపరరీ నంబర్‌కు కాల్స్ రావు, మెసేజ్‌లు కూడా పంపలేరు. ఇది కేవలం రీచార్జ్, లావాదేవీల కోసం మాత్రమే ఉపయోగించే డమ్మీ నంబర్.

ప్రస్తుతం ఈ సేవ బిఎస్ఎన్ఎల్ అధికారిక వెబ్‌సైట్ లేదా సెల్ఫ్ కేర్ యాప్‌లో అందుబాటులో లేదు. దీన్ని యాక్టివేట్ చేయడానికి సులభమైన మాన్యువల్ ప్రక్రియ ఉంది.

లిముందుగా మీ బిఎస్ఎన్ఎల్ నంబర్ నుంచి 1800-180-1503 అనే టోల్ ఫ్రీ నంబర్ కు కాల్ చేయాలి.

కాల్ కనెక్ట్ అయిన తరువాత IVR సూచనలను అనుసరించాలి.


కస్టమర్ కేర్ ఎగ్జిక్యూటివ్ తో మాట్లాడే ఆప్ష-న్‌ను ఎంచుకోవాలి.

మీ సర్వీస్ ఏరియా, పిన్ కోడ్ వంటి ప్రాథమిక వివరాలను అడిగి ధృవీకరిస్తారు.


వివరాలు ధృవీకరించిన తరువాత మీకు 10 అంకెల కవచ్ నంబర్ SMS ద్వారా పంపిస్తారు.

ఆ తరువాత మీరు మీ అసలు మొబైల్ నంబర్ గోప్యంగా ఉంచాలనుకున్న ప్రతిచోటా ఈ కవచ్ నంబర్ ను ఉపయోగించవచ్చు.

# రూ.581 కోట్ల ఆస్తులను జప్తు




ప్రముఖ వ్యాపారవేత్త అనిల్ అంబానీకి వరుస ఎదురుదెబ్బలు తప్పట్లేదు. ఈ నెల ప్రారంభంలోనే రిలయన్స్ పవర్‌కు సంబంధించి పలు ప్రాంతాల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) సోదాలు నిర్వహించిన సంగతి తెలిసిందే. తాజాగా రిలయన్స్ గ్రూప్ చైర్మన్ అనిల్ అంబానీకి చెందిన ఆర్‌హెచ్‌ఎఫ్ఎల్, ఆర్‌సీఎఫ్ఎల్ కంపెనీలకు చెందిన కొత్త ఆస్తులను అటాచ్ చేసినట్లు ఈడీ గురువారం ప్రకటనలో తెలిపింది. గోవా, కేరళ, కర్ణాటక, పంజాబ్, తమిళనాడు, ఉత్తరప్రదేశ్, హర్యానా, జార్ఖండ్, మహారాష్ట్ర, ఢిల్లీ, పశ్చిమ బెంగాల్, ఆంధ్రప్రదేశ్, రాజస్థాన్‌లలో ఉన్న భూములను అటాచ్ చేయాలని మార్చి 11న ఉత్తర్వు జారీ చేసినట్లు పేర్కొంది. రిలయన్స్ హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్ (ఆర్‌హెచ్ఎఫ్ఎల్), రిలయన్స్ కమర్షియల్ ఫైనాన్స్ లిమిటెడ్ (ఆర్‌సీఎఫ్ఎల్)లకు చెందిన రూ.581.65 కోట్ల విలువైన ఆస్తులు ఉన్నాయని ఈడీ స్పష్టం చేసింది. మార్చి 6న విదేశీ మారక నిర్వహణ చట్టం (ఫెమా) కింద రిలయన్స్ పవర్ లిమిటెడ్‌పై జరిగిన కేసులో సోదాల నేపథ్యంలో ఈ అటాచ్‌మెంట్ జరిగింది. దీంతో రిలయన్స్ అనిల్ అంబానీ గ్రూప్ అటాచ్‌మెంట్ మొత్తం విలువ రూ.16,310 కోట్లకు చేరుకుందని ఈడీ వెల్లడించింది. అనిల్ అంబానీకి చెందిన కంపెనీలు రూ. వేల కోట్ల విలువైన బ్యాంకు రుణాల మోసం ఆరోపణలతో ఆయనపై ఈడీ కేసు నమోదు చేసింది.



# వాట్సాప్లో కొత్త ఫీచర్

సోషల్ మెసేజింగ్ యాప్ వాట్సాప్ 13 ఏళ్లలోపు పిల్లల కోసం కొత్త ఫీచర్‌ను తీసుకొచ్చింది. "పేరెంట్ మేనేజ్డ్" అకౌంట్ మోడల్‌తో తల్లిదండ్రుల పర్యవేక్షణలో వీరు వాట్సాప్ అకౌంట్ ఓపెన్ చేసుకోవచ్చు. వాట్సాప్ అకౌంట్ ఓపెన్ చేయడానికి ఇప్పటివరకు కనీస వయసు పరిమితి 13 ఏళ్లుగా ఉంది. తల్లిదండ్రులు లేదా గార్డియన్లు పిల్లల కోసం అకౌంట్ సెట్ అప్ చేస్తారు. వారి కాంటాక్ట్ లిస్ట్‌ను నియంత్రించగలుగుతారు. మెసేజ్‌స్‌కు మాత్రం ఎండ్- టు- ఎండ్ ఎన్‌క్రిప్షన్ ప్రొటెక్షన్ ఉంటుంది. సెట్టింగ్స్‌ను మార్చాలంటే పేరెంట్ పిన్ ఇవ్వడం తప్పనిసరని వాట్సాప్ తెలిపింది.

# భారీ నష్టాల్లో స్టాక్ మార్కెట్




దేశీయ స్టాక్ మార్కెట్‌ను యుద్ధ భయం వెంటాడుతోంది. పశ్చిమాసియా యుద్ధం ప్రారంభమైన దగ్గర నుంచి మార్కెట్ భారీగా పతనం అవుతూ వచ్చింది. తాజాగా చమురు ధరలు పెరగడంతో మార్కెట్ ఢమాల్ అయింది. భారీ నష్టాల్లో సూచీలు కొనసాగుతున్నాయి. ప్రస్తుతం సెన్సెక్స్ 907 పాయింట్లు నష్టపోయి 75, 138 దగ్గర కొనసాగుతుండగా.. నిఫ్టీ 301 పాయింట్లు నష్టపోయి 23, 337 దగ్గర కొనసాగుతోంది.అన్ని రంగాల సూచీలు నష్టాల్లో ట్రేడవుతున్నాయి, ఆటో, బ్యాంకులు, రియాల్టీ, ఐటీ, మెటల్, మీడియా ఒక్కొక్కటి 1 శాతం తగ్గాయి. నిఫ్టీ మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు ఒక్కొక్కటి 1.5 శాతం తగ్గాయి. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఎన్‌టీపీసీ గ్రీన్ ఎనర్జీ, ఎల్ అండ్ టీ, ఎం అండ్ ఎం, నాల్కో ఎన్ఎస్ఇలో అత్యంత చురుగ్గా ఉన్నాయి.



# తగ్గిన వెండి, బంగారం ధరలు

ప్రపంచ దేశాలను యుద్ధ సంక్షోభం వెంటాడుతున్న వేళ అన్ని ధరలు పెరుగుతున్న సమయంలో బంగారం, వెండి ధరలు మాత్రం దిగొస్తున్నాయి. పెళ్లిళ్లు, శుభకార్యాల సమ-యాల్లో కొనుగోలుదారులకు ఇది శుభవార్తగా చెప్పొచ్చు. ఈరోజు తులం గోల్డ్ ధరపై రూ.980 తగ్గగా.. కిలో వెండిపై రూ.100 తగ్గింది.తులం గోల్డ్‌పై రూ.980 తగ్గడంతో బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,61,240 దగ్గర ట్రేడ్ అవుతోంది. ఇక 22 క్యారెట్ల 10 గ్రాముల ధరపై రూ.900 తగ్గడంతో రూ.1,47,800 దగ్గర అమ్ముడవుతోంది. ఇక 18 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధరపై రూ.740 తగ్గడంతో రూ.1,20,930 దగ్గర ట్రేడ్ అవుతోంది.ఈరోజు సిల్వర్ ధర ఊరట కలిగించింది. ఈరోజు కిలో వెండి ధరపై ఏకంగా రూ.100 తగ్గడంతో బులియన్ మార్కెట్‌లో కిలో వెండి రూ.2,79, 900 దగ్గర అమ్ముడవుతోంది. హైదరాబాద్, చెన్నైలో మాత్రం కిలో వెండి ధర రూ.2,90,000 దగ్గర ట్రేడ్ అవుతోంది.




# ఇంట్రెస్టింగ్‌గా టీజర్

శుభం ఫేమ్ యంగ్ టాలెంటెడ్ యాక్టర్ హర్షిత్ రెడ్డి హీరోగా నటిస్తున్న కొత్త సినిమా 'దీవాన'. దర్శకుడు శ్రీకాంత్ సంగిరెడ్డి రూపొందిస్తున్న ఈ బ్యూటీఫుల్ లవ్ స్టోరీతో స్నేహ మణిమేగలై హీరోయిన్‌గా తెలుగు ప్రేక్షకులకు పరిచయవ-వుతోంది. అర్హ మీడియా, వీ స్టూడియోస్ బ్యానర్‌పై వాసుదేవ్ కొప్పినేని, శ్రీదేవి కార్యంపూడి నిర్మిస్తున్నారు. సమ్మర్ స్పెషల్‌గా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు సిద్ధం అవుతున్న ఈ చిత్రానికి సంబంధించి ఇప్పటికే ప్రమోషన్స్ స్టార్ట్ చెయ్యగా.. తాజాగా టీజర్ రిలీజ్ చేశారు మేకర్స్. ఇక టీజర్‌ను గమనించినట్లయితే.. ఓ పెళ్లి వేడుకల్లో హీరోయిన్‌ను చూసి లవ్ ఎట్ ఫస్ట్ సైట్ అన్నట్లు ప్రేమలో పడతాడు హీరో. అప్పటి నుంచి ఆ అమ్మాయే లోకంగా బతుకుతుంటాడు. ఆ అమ్మాయి తరుపు వాళ్లతో ప్రమాదమని స్నేహితులు చెప్పినా వినిపించుకోడు. ఇంతే ప్రేమ అమ్మాయి నుంచి కూడా ఈ అబ్బాయికి దక్కిందా లేదా అనేది థియేటర్స్ చూడాలి. టీజర్‌లోని 'ప్రేమ ఇది ప్రేమ గుండెల్లోన సడిరేపేదే ప్రేమ...' సాంగ్ బీజీఎం హార్ట్ టచింగ్‌గా యూత్‌ను ఆకట్టుకుంటోంది. మొత్తంగా ఈ టీజర్ సినిమాపై పాజిటివ్ ఎక్స్‌పెక్టేషన్స్‌ను క్రియేట్ చేస్తుంది. ఇక టీజర్ లాస్ట్‌లో 'ఎంత అందంగా ఉంటే అంత సతాయిస్తర్ర ఈ పోరీలు.. అది నీ పానం పీక్కతినకపోతే నన్ను అడుగురా..' అనే డైలాగ్స్ హైలెట్‌గా నిలిచాయి.



# ట్విస్టులు, టర్నులు..

'దేశముదురు' సినిమాతో టాలీవుడ్ ప్రేక్షకులకు దగ్గరైన హన్సిక మోత్వాని, ఆ తర్వాత తెలుగులో చాలామంది స్టార్ హీరోలతో నటించి స్టార్ హీరోయిన్ అయిపోయింది. ఆ తర్వాత కాలంలో బాలీవుడ్ కి వెళ్ళిన ఆమె, పూర్తిగా తెలుగు సినీ పరిశ్రమకు దూరమైంది. అయితే, ఆమె ఇటీవల విడాకులు తీసుకున్నట్లు తెలియడంతో మరోసారి వార్తల్లోకి వచ్చింది. వాస్తవానికి హన్సిక ప్రేమ వివాహం చేసుకుంది. అయితే, ఆ ప్రేమ వివాహం కూడా అంత ఈజీగా ఏమీ జరగలేదు. ఆమె ఇదివరకే విడాకులు తీసుకున్న వ్యక్తిని వివాహం చేసుకుంది. ఆమె భర్త పేరు సోహైల్ కాగా, అతను గతంలో హన్సిక ప్రాణ స్నేహితురాలినే పెళ్లి చేసుకుని విడాకులు తీసుకున్నాడు. మరో ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, వారి వివాహానికి హన్సిక హాజరై దగ్గరుండి ఆ వివాహాన్ని జరిపించింది.వాళ్లు విడాకులు తీసుకున్న తర్వాత, హన్సిక సదరు వ్యక్తిని ప్రేమించి వివాహం చేసుకుంది. 2022లో వీరి వివాహం జరిగింది. అయితే, పెళ్లి అయిన రెండేళ్లకే వీరి మధ్య వివాదాలు తలెత్తడంతో విడిపోయారు. అప్పటినుంచి విడివిడిగానే ఉంటున్నారు. తాజాగా వీరు విడాకులకు అప్లై చేసి, కోర్టు ద్వారా అధికారికంగా విడిపోయారు. వాస్తవానికి హన్సిక వివాహం చేసుకుంటున్నట్లు ప్రకటించినప్పుడు, ఆమె మీద సోషల్ మీడియాలో విపరీతమైన నెగిటివిటీ వచ్చింది. దాన్ని తట్టుకుని మరీ హన్సిక ముందుకు వెళ్ళింది, కానీ వారి వివాహ బంధం మాత్రం ఎక్కువ రోజులు నిలబడలేకపోయింది.

# ఆలోచింపచేసేలా 'కార్మేని సెల్వం'




రామ్ చక్రి దర్శకత్వంలో తెలుగు, తమిళ భాషల్లో రూపొందుతున్న ద్విభాషా చిత్రం 'కార్మేని సెల్వం'. విలక్షణ నటులు సముద్రఖని ప్రధాన పాత్ర పోషిస్తున్న ఈ చిత్రంలో గౌతమ్ వాసుదేవ్ మీనన్ కీలక పాత్రలో కనిపించనుండగా పాత్‌వే ప్రొడక్షన్స్ బ్యానర్‌పై అరుణ్ రంగరాజులు నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. లక్ష్మీ ప్రియా, అభినయ, కార్తిక్ కుమార్, బడవ గోపీ, కోతండం, కరణ్ చక్రవర్తి, శంకర నారాయణ్ వి, హరిత పరాకోడ్ ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ సినిమా ఏప్రిల్ 3న తెలుగు, తమిళ భాషల్లో గ్రాండ్ గా థియేట్రికల్ రిలీజ్ కాబోతుంది. ప్రముఖ డిస్ట్రిబ్యూషన్ సంస్థ పీవీఆర్ ఐనాక్స్ పిక్చర్స్ ద్వారా ఈ చిత్రం థియేటర్స్ లోకి రాబోతుంది. ఆధునిక కాలానికి అనుసంధానమైన ఈ కథ ఇప్పటికే విడుదలైన ఫస్ట్ లుక్ పోస్టర్‌తో మంచి ఆసక్తిని పెంచగా గురువారం తెలుగు టీజర్ ను రిలీజ్ చేసింది చిత్ర యూనిట్."డబ్బు సంపాదించడానికి చాలా మార్గాలు ఉన్నాయి" అని సముద్రఖని వాయిస్ ఓవర్ తో ప్రారంభమైన టీజర్ సినిమాపై క్యూరియాసిటిని పెంచుతుంది. అధిక ఖర్చులు, భారీ లోన్లు, క్రిప్టో పెట్టుబడులు, త్వరగా ధనవంతులు కావాలనే ఆశతో చేసే ప్రయత్నాలు వంటి విషయాలను వివిధ కోణాల్లో చూపిస్తూ నేటి సమాజంలో డబ్బు పట్ల ఉన్న ఆలోచనలను చూపించిన విధానం ఆకట్టుకుంటుంది. ముఖ్యంగా ఈఎంఐలు, క్రెడిట్ కార్డ్ ఆధారిత జీవనశైలి, డబ్బు కోసం మనుషులు తీసుకునే నిర్ణయాలు కథలో కీలక పాత్ర పోషించబోతున్నాయని అర్థమవుతుంది. సముద్రఖని కుటుంబంతో కనిపించే సన్నివేశాలు హృదయానికి హత్తుకునేలా ఉంటాయి. లక్ష్మీ ప్రియా చంద్రమౌళి ఆయన భార్యగా, చిన్న కుమారుడితో కుటుంబ జీవితం చూపిస్తుండగా, మరోవైపు విదేశాల్లో ఒంటరిగా కనిపించే కొన్ని షాట్లు కథపై మరింత ఆసక్తిని పెంచుతున్నాయి. గౌతమ్ వాసుదేవ్ మీనన్ పాత్రను గోప్యంగా ఉంచడం కూడా ప్రేక్షకుల్లో ఉత్కంఠను పెంచుతోంది. టీజర్ చివర్లో.."రిచ్ కావాలంటే రిచ్ మనిషిలా ఖర్చు చేయడం నే-ర్చుకోవాలి... డబ్బు లేకపోతే అప్పు తీసుకుని ఖర్చు చేయాలి" --- అని సముద్రఖని చెప్పే డైలాగ్ ప్రేక్షకులలో ఆలోచన రేకెత్తించేలా నిలుస్తుంది.





# యూత్ ఫుల్ ఎంటర్‌టైనర్‌గా

కెన్ కరునాస్, అనిష్మ అనిల్ కుమార్, దేవదర్శిని చేతన్, సూరజ్ వెంజరముడు, ప్రియాన్షి యాదవ్, మీనాక్షి దినేష్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తమిళ మూవీ 'యూత్'. ఈ చిత్రాన్ని ఇదే పేరుతో తెలుగు ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు హౌస్ ఫుల్ వినీత్, సందీప్. ఈ చిత్రానికి కెన్ కరునాస్ అండ్ గ్యాంగ్ దర్శకత్వం వహించారు. త్వరలోనే 'యూత్' మూవీ తెలుగులో గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రాబోతోంది. ఈ సందర్భంగా తాజాగా ఈ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్‌ను హీరో కిరణ్ అబ్బవరం లాంచ్ చేశారు. అనంతరం టీమ్‌కు ఆల్ ది బెస్ట్ తెలిపారు. మలయాళ బ్లాక్ బస్టర్ ప్రేమలు తెలుగులోనూ ఘన విజయాన్ని అందుకుంది. అలాగే ఇలాంటి తరహా కంటెంట్ తోనే వచ్చిన లిటిల్ హార్ట్స్ కూడా పెద్ద సక్సెస్ దక్కించుకుంది. ఇప్పుడు తెలుగు ఆడియె-న్స్‌కు కావాల్సిన యూత్ ఫుల్ రొమాంటిక్ ఎంటర్ టైనర్ జానర్‌లో వస్తున్న "యూత్" సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్ తోనే అలాంటి వైబ్స్ క్రియేట్ చేస్తోంది.

# అవకాశాలు లేకపోయినా...

బ్యూటిఫుల్ నటి ప్రణీత గురించి ప్రత్యేక పరిచయం అవసరం లేదు. ఈమె తెలుగులో చాలా సినిమాల్లో నటించింది. కొన్ని సంవత్సరాల క్రితం జూనియర్ ఎన్టీఆర్ హీరోగా రూపొందిన రభస, పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా తెరకెక్కిన అత్తారింటికి దారేది చిత్రాల్లో ఈమె రెండవ హీరోయిన్గా నటించింది.ఇందులో రభస సినిమా ఫెయిల్యూర్ కాగా, అత్తారింటికి దారేది బ్లాక్ బాస్టర్ అయింది. ఈ రెండు చిత్రాల ద్వారా ప్రణీతకి మంచి గుర్తింపు వచ్చింది. చాలా కాలం పాటు తెలుగు సినిమాల్లో నటించినా కూడా ఈ బ్యూటీ కెరీర్ను పీక్ స్టేజ్ లో సాగించలేదు.కేవలం తెలుగు మాత్రమే కాకుండా ఈమె అనేక ఇతర భాషల సినిమాల్లో కూడా నటించింది. సినిమా అవకాశాలు కాస్త తగ్గుముఖం పట్టిన సమయంలో ప్రణీత వివాహం చేసుకుంది.ప్రస్తుతం ప్రణీత పెద్దగా సినిమాల్లో నటించకపోయినా సోషల్ మీడియాలో చాలా యాక్టివ్గా ఉంటుంది. అనేక సందర్భాలలో సోషల్ మీడియాలో హాట్ ఫోటోలను పోస్ట్ చేస్తుంది. అందులో చాలా వరకు వైరల్ కూడా అయ్యాయి.తాజాగా ఈ సీనియర్ నటి తన 'ఇన్ స్టా'లో కొన్ని ఫోటోలను పోస్ట్ చేసింది. అందులో ఈమె బ్లాక్ కలర్ సారీని డిఫరెంట్ లుక్ లో కట్టుకొని, కిల్లింగ్ లుక్లో ఉన్న ఫోటోలను పోస్ట్ చేసింది.బ్లాక్ కలర్ చీరలో ఈ బ్యూటీ చాలా అందంగా ఉండడంతో ఈ ఫోటోలు వైరల్ అవుతున్నాయి. ఈ ఫోటోలకి



చాలా మంది వావ్, గార్జియస్, సో క్యూట్, లవ్, ఫైర్ ఎమోజీలను కామెంట్లుగా పెడుతున్నారు.



# 'డ్రాగన్' యాక్షన్ పీక్స్...

ఎన్టీఆర్-ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో రూపొందుతున్న భారీ యాక్షన్ ఎంటర్టైనర్ 'డ్రాగన్'. ఇటీవల జోర్డాన్‌లో కీలకమైన షెడ్యూల్‌ను పూర్తి చేసుకున్న చిత్ర యూనిట్, ఇప్పుడు తదుపరి యాక్షన్ వేట కోసం సిద్ధమైంది. జోర్డాన్ షెడ్యూల్‌లో హై-వోల్టేజ్ యాక్షన్ సన్నివేశాలను తెరకెక్కించాడు ప్రశాంత్ నీల్. ఇక ఇప్పుడు నెక్స్ట్ షెడ్యూల్‌లో కూడా భారీ యాక్షన్ ఉండబోతుందని తెలుస్తోంది. కొత్త షెడ్యూల్ ఈ వారంలోనే హైదరాబాద్‌లో ప్రారంభం కానుందని సమాచారం.ఇందుకోసం నగర శివార్లలోని ఒక ప్రముఖ స్టూడియోలో మూడు భారీ సెట్లను నిర్మించారట. ఇందులో విలన్ ఇంటికి సంబంధించిన సెట్ కూడా ఉందట. దాదాపు నెల రోజులకు పైగా సాగే ఈ లాంగ్ షెడ్యూల్‌లో.. సినిమాలోని కీలక సన్నివేశాలను చిత్రీకరించనున్నారట. ఇక ఇక్కడ షూటింగ్ పూర్తయిన వెంటనే, చిత్ర యూనిట్ తదుపరి షెడ్యూల్ కోసం శ్రీలంక వెళ్లేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. అక్కడ కూడా యాక్షనే ఉంటుందని టాక్. మొత్తంగా చూ-సుకుంటే.. డ్రాగన్ యాక్షన్ షెడ్యూల్సే ఎక్కువగా ఉన్నాయి. ఈ లెక్కన ప్రశాంత్ నీల్ ఏ రేంజ్ యాక్షన్ డోస్ ఇవ్వబోతున్నాడో అర్థం చేసుకోవచ్చు. ఈ సినిమాలో రుక్మిణీ వసంత్ హీరోయిన్‌గా నటిస్తుండగా, బాలీవుడ్ స్టార్ అనిల్ కపూర్ మరియు మలయాళ నటుడు టోవినో థామస్ కీలక పాత్రల్లో కనిపించబోతున్నారు. 'కె.జి.ఎఫ్', 'సలార్' వంటి బ్లాక్ బస్టర్స్ తర్వాత ప్రశాంత్ నీల్ నుంచి వస్తున్న చిత్రం కావడంతో.. డ్రాగన్ పై అంచనాలు పీక్స్‌లో ఉన్నాయి. మరి ప్రశాంత్ నీల్ మార్క్ మేకింగ్‌తో బాక్సాఫీస్ దగ్గర ఎన్టీఆర్ ఎలాంటి సెన్సేషన్ క్రియేట్ చేస్తాడో చూడాలి.



# యాక్షన్‌లో చెప్పిన లవ్ స్టోరీ:

బ్యాక్ టు బ్యాక్ చిత్రాలతో అలరిస్తున్న హీరో అడివి శేష్ ఇప్పుడు కొత్త అవతార్‌లో డెకాయిట్'తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఈ చిత్రంలో శేష్ తొలిసారిగా మాస్, రగ్గడ్ పాత్రలో కనిపించనున్నారు. మృణాల్ ఠాకూర్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంతో షానియల్ డియో దర్శకుడిగా అరంగేట్రం చేస్తున్నారు. సుప్రియా యార్లగడ్డ నిర్మిస్తున్న ఈ మూవీ ఏప్రిల్ 10న రాబోతున్నది. ఇప్పటికే విడుదలైన ప్రమోషనల్ కంటెంట్‌కి అద్భుతమైన రెస్పాన్స్ రాగా.. షూటింగ్ పూర్తి చేసుకన్న సదర్భంగా సినిమా విశేషాలు పంచుకున్నాడు అడివి శేష్. 'డెకాయిట్ ఒక కొత్త జోనర్‌లో చేసిన సినిమా. ఈ మధ్యకాలంలో మనం లవ్ స్టోరీస్ చెప్పడం మానేశాము. ఈరోజుల్లో అందరూ ఒక మంచి లవ్ స్టోరీ కోరుకుంటున్నారు. ఈ రోజుల్లో లవ్ స్టోరీనే యూనిక్. ఇది థ్రిల్లింగ్ యాక్షన్‌లో చెప్పిన లవ్ స్టోరీ. ఒక కొత్త జోనర్లో చేసిన ప్రయోగం. కథలో అవసరం ఉందంటే నేను ఏదైనా చేస్తాను. ఇందులో రుబారూ కూడా కథలో ఆ క్యారెక్టర్‌కి అవసరమైన సాంగ్. ఈ సినిమా అందరినీ ఎక్సయిట్ చేస్తుంది. సినిమా చివరకు వచ్చేసరికి అందరూ ఎమోషన్ అవుతారు. ఫ్యామిలీస్‌తో కలిసి చూడదగ్గ ఒక జెన్యూన్ ఫిలిమ్' అని చెప్పుకొచ్చాడు.

# నన్ను నేను తగ్గించుకున్నా..



తాజాగా, ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న అనన్య మాట్లాడుతూ.. "గతంలో నేను రిలేషన్‌షిప్‌లో ఉన్నప్పుడు అవతలి వ్యక్తి నాకంటే ఎక్కువగా మెరవాలని కోరుకునేదాన్ని. ఇందుకోసం నన్ను నేను తక్కువ చేసుకునేదాన్ని. ఎదుటి వ్యక్తికి నచ్చేలా నన్ను నేను మార్చుకునేదాన్ని. ఒక వ్యక్తి కోసం మనల్ని మనం మార్చుకోకూడదని నేను ఆలస్యంగా తెలుసుకున్నాను" అని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో తాను ఒక్క క్షణం కూడా ఒంటరిగా ఉండలేకపోయేదాన్ని అని, కానీ ఇప్పుడు ఒంటరిగా ఉండటం, తన వ్యక్తిగత స్పేస్‌ను ఆస్వాదించడం నేర్చుకున్నానని ఆమె వెల్లడించారు.

Edited, Printed, Published & Owned by **KOMARAJU SRINIVASULU** and Printed at **Ramu Graphics**, Shop No:5,Near Clock Tower Church Compound, Nalgonda District (T.S.), Published From: KOMARAJU SRINIVASULU, Village: Anthaiah Gudem, Post: Duppalapally, Mandal: Thipparthy-508247, Dist. Nalgonda, (T.S) **Editor: KOMARAJU SRINIVASULU. Cell: 7730032999, E-mail: flashindiadaily@gmail.com, www.flashindianews.com, RNI No. APTEL/2010/33229**